


# పనిపిల్ల

– చిమ్మెట రఘోత్తమ రెడ్డి

అప్పటికి సాయంత్రం నాలుగున్నర గంటల సమయం. ఎండ మధ్యాహ్నం చిటపటలాడించి సాయంత్రానికి చల్లబడేకాలం.

చాయ్‌లు తాగి వాళ్లు ముగ్గురు బంగ్లాలోపలినుండి వచ్చి ముందు వీధిలో నిలబడ్డారు. బంగ్లాకు ఎడమవైపు సందులో వడ్ల గిర్ని చవ్వుడు 'పటపట'మని తిరిగే గిర్ని బెల్టుల అలజడి. వడ్ల గిర్ని, పిండి గిర్ని వాటికితోడు పల్లి గింజల మంచి మావె తీసే చిన్న మావె గిర్ని – అన్ని యంత్రాలు ఏక కాలంలో తిరుగుతూ వింత సందడి ఆ వీధివీధంతా విన్పిస్తోంది. అక్కడికి వడ్లు, జొన్నలు, మిరపకాయలు, పల్లి గింజలు తీసుకొని సాయంత్రం వేళ చాలా మంది రైతు స్త్రీలు వచ్చి చేరుతున్నారు. వాళ్లల్లో వాళ్లకు ముందు, వెనకా రావడాల గురించి పోవడాలి

# చిల్లర బ్రతుకులు




పుట్టిన పాపకు బర్త్ సర్టిఫికేట్ అడిగితే
చిల్లర కొట్టలేదని పదిసార్లు తిప్పిన మున్సిపల్ ఆఫీసును చూశాను
చిల్లర అడిగితే చిరాకుపడ్డ బస్సు కండక్టర్నీ చూశాను
చిల్లర వెయ్యలేదని శఠగోపం పెట్టని పూజారిని చూశాను.
చిల్లర వదలలేదని విలన్ ఫోజు పెట్టిన కాఫీ హోటల్ సప్లయర్నీ చూశాను–
చిల్లర మస్తుగా పెట్టుకోండని మరీ మరీ చెప్పిన పెళ్ళి పురోహితుణ్ణి చూశాను.
చిరుదిండ్లకు చిల్లర ఇవ్వలేదని స్కూల్‌కు ఎగనామం బెట్టిన చిన్నారుల్నీ చూశాను.
చిల్లర డబ్బులు అడుక్కునేందుకు తమ బిడ్డలకు చిన్నతనంలోనే అంగవైకల్యం కల్పించిన అధముల్నీ చూశాను
గోదావరిలో పుణ్యం కోసం విసిరిన చిల్లర డబ్బుల కోసం
నదిలో దూకి ప్రాణాలు విడిచిన అభాగ్యుణ్ణీ చూశాను
శవం మీది నుంచి విసిరే చిల్లర డబ్బుల కోసం కీచులాడుకొనే ఆకలి జీవుల్నీ చూశాను–
ప్రాణాలు విడిచిన అభాగ్యుడి నోట్లో చిల్లర డబ్బులు పెట్టి స్మశానానికి పంపిన తీరూ చూశాను.
మనిషి జననంతో–మనుగడతో– చివరకు మరణంతో
కూడ ఆడుకొనే ఈ చిల్లర బ్రతుకేమిటని ఆలోచిస్తే
అసలు మనిషి బ్రతుకే చిల్లర బ్రతుకనిపించింది నాకు

–కోనేరు రాజబాబు.

గురించి తగాదాలు. అందులో ఓ బొంగురుగొంతు స్త్రీ బియ్యం సరిగా రాలేదని అరుస్తోంది. పిండి మెత్తగా లేదని మరో స్త్రీ ఫిర్యాదు చేస్తోంది. మిరపకాయలు ఘాటుకు తుమ్ములు దగ్గులు–ఇలాంటి కయ్యర గియ్యర గందరగోళానికి తోడు ఎండా కాలవు సాయంత్రం మిర పకాయల గిర్ని అందర్ని అతలాకుతలం చేస్తోంది. ముక్కులు చీదేవాళ్లు–అంతూపొంతూ లేకుండా వదరేవాళ్లు వదురుతున్నారు.

"ఒరేయ్ శివయ్యా!" గిర్ని షెడ్డువేపు గట్టిగా కేకేసింది యశోదమ్మ. శివయ్యతో పనివున్నట్టు గాకాక అలవోకగా వుందాకేక. గిర్ని షెడ్డుమ చేరవే లేదు.

బంగ్లాముందు ప్రహారిగోడకామకొని వున్న అరుగుమీద కూర్చున్న తమ్ముడు కృష్ణారెడ్డి – ఈ గడబిడలో కలువకుండ అతని పక్కవే నిలబడివ తమ్ముడి దోస్తు మహేంద్ర దగ్గరికి రెండడుగులేసి నిట్టూర్చి "పోరి తిండిలేక ఎంటుకపోయింది. మనింటికి తీసుకపోయి ఇంత బట్ట పొట్ట పెడితె ప్రాణం బట్టి బాగానే వుంటది. దిక్కులేని పోరి! అక్కడ మన దగ్గెర వుండకపోవుడవే సమస్యేరాదు. దానికిక్కడ తల్లితండ్రి ఎవలు లేరు. ఇంతకాలం దానమ్మమ్మ, తాత చూసుకున్నారు. ఆ ముసల్దికూడా ఈ కరవుకు తిండిలేక ఎండుకపోయి ఎండుకపోయి ఈ మధ్యనే సచ్చిపోయింది. ఇగ ముసలోడు ఈపోరి మిగిలిండ్రు – వాడివ్వాడో అప్పుడో అంట వున్నడు. ఆ మధ్యన ఆ ముసలోడు గెంటుకుంట గెంటుకుంటచ్చి "అవ్వా మీ యింట్లనన్న పనికి వుంచుకోండ్రి. అట్లనన్న పోరి బతుకుతదని కాళ్లు కదువులు మొక్కిండు. అన్నోళ్లకే పనిలేదు నేనేం జేసుకోవని మర్రగొట్టిన–"

యశోదమ్మ ఒకమారు వెత్తిమీద పిండిని కొంగుతో దులువుకొని రొండికున్న డబ్బు సంచిని సర్దుకొని తిరిగి పనిలోనికి పోవడానికి సిద్ధపడ్డట్టుగా కన్పించింది.

పిడికెడు తాళం చేతులుగల వెండి తాళం చెవులగుత్తిని బొడ్లో దోపుకొని తమ్ముడు కృష్ణా రెడ్డి వైపు చూస్తూ "ఇంతల్నే నిన్నమొన్న అక్కడెవరికో పనిపిల్ల కావన్నని ఫోన్ చేస్తివి. నిన్న సాయంత్ర మే ముసలోనికి 'మతలబ్' చేసిన. ముసలోనికి చాతకాకుంటున్నది. ఈడ్సుకుంట ఈడిదాక రాలేడు. మీరే పోయి పోరిని చూసిరాండ్రి. వచ్చుతే రేపు ముసలోడే తీసుకవత్తడు."

గిర్ని దగ్గరి నుండి ఎవరో పిలవడంతో ఆదర బాదరగా వెళ్లిపోయింది.

"మా అక్కయ్య తలెంటికలన్ని పనులు పెట్టుకున్నది. వద్దంటే వినదు." కృష్ణారెడ్డి మాటక లుపుతూ–

మహేంద్ర యశోదమ్మకు అట్లా లోపలిమాట, పైమాట కలిపి మాట్లాడడం ఎట్లా సాధ్య మౌతోందా అని ఆలోచిస్తున్నాడు.

గిర్నీలదగ్గరి లావాదేవీలు చూసుకొని యశోదమ్మ మళ్లీ వచ్చింది.

"సాయంకాలం పూట గద గిరాకి ఎక్కువున్నది." అని కాసేపాగి గిర్ని దగ్గరి సందడి నుండి దేరుకొన్న దానిలాగా "అది చేసే పనేమంత వుందక్కడ – బోళ్లుతోమడం – భార్యభర్తలిద్దరు ఉద్యోగాలకు పోతే పిల్లలను చూడడం – ఆ యింత పని పోరి మా చేస్తది. ఇక్కడ తిండికి మాడి చస్తున్నరు." యశోదమ్మ తను చెప్పవల్సినదంతా చెప్పేసింది.

మళ్లీ గిర్ని షెడ్డు వేపు చూస్తూ "నేనెట్లనో చూసుకుంటగని శివయ్యను తీసుకోని సైకిల్ మోటర్ మీదపోయి రాండ్రి. రేప్పొద్దున 'రామప్ప' చెరువూ, గుళ్ళు చూడబోదురుగాని –"గిర్ని వేపు పోబోయి ఆగింది.

"రేపు మండలాల రైతులధర్నాలట – కరవు గిట్టుబాటుధరలు – కరెంటు కట్టు గురించి – ఈపట్టె సర్పంచులందరిని గుట్టకు పిల్చి అన్నలు చెప్పిండ్రట – సర్పంచులంత గోచులు బిగిచ్చి ఊరూర తిరుగుతున్నరు. ఈ సంగతి పోలీసులకు దెల్సి 'పోవద్దని' వాళ్లు చెప్తున్నరు. రాత్రి అన్నల రాజ్యం – పగలు పోలీసోల్ల రాజ్యం. నడుమ సర్పంచులు – అంత గందర గోళంగున్నది. ఎటుపోయి ఎటునుట్టు కత్తదో తెలువకుంటున్నది. ఇంతకు ముందే మీరు రావడానికి అరగంట కింద పోలీసోల్లు జీబులకు మైకులు బెట్టుకోవచ్చి నలుగురికన్నా ఎక్కువ కలిసి తిరుగద్దని చెప్పిపోయిండ్లు. కుప్పకూడితె కాల్చి పారేయమని పై నుంచి ఆర్డర్లచ్చినయట–" తనకు తెలిసిన విషయాలన్ని చెప్పకొచ్చింది యశోద.

యశోద భర్త సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయాడు. గెలిచిన సర్పంచు ఒకరెడ్డి కులస్తుడైన భూస్వామికి ఒకనాయికను స్త్రీ అయిన దానికి పుట్టిన సంతానమే. ఆయనను అన్నలు సపోర్టు చేస్తేనే గెలిచిండని యశోద ఫిర్యాదు.

"మీరు నాయకను గూడెంపోయే తొవ్వల ఎవరన్న పోలీసులు అడుగుతే బావ పేరు చెప్ప ఇక్కడి సర్కిల్ పోచయ్య, బావకు బాగా తెలుసు – మనోడే – మన శివ్వనికి కూడా చెప్తతలే – " యశోద గిర్ని వేపు పోయింది.

క్రిష్ణారెడ్డి, మహేంద్ర వాకిట్లో పచార్లుచేస్తున్నారు. పందిరి కింద కట్టేసిన అల్సేషన్ కుక్క మహేంద్ర కేసి పదే పదే చూస్తూ మురగాలో వద్దో తేల్చుకోలేకుండా వున్నది. బంగ్లాకు కుడివేపు కొట్టం అవలి పక్క ఎవరో ఇద్దరు హరిజన స్త్రీలు వడ్లు శుభ్రం చేస్తున్నారు. కొట్టంలో నాలుగు దుడ్డెలు తిరిగి రానల్సిన తల్లుల గురించి ఉండీ ఉండీ అరుస్తున్నాయి. గొట్టంలో నుండి రొచ్చువాసన ఘాటుగా వస్తోంది. గోడలకు ఆనించిన నాగళ్లు బండీగిరెల్లు – ఎక్కడ పడితే అక్కడ బస్తాలు వ్యవసాయపు సామానులతో ఇల్లు చిటకొటారంలాగున్నది.

తువ్వాలతో దుమ్ము దులువుకుంటూ గిర్ని షెడ్డులోనుంచి శివయ్య గబగబ వచ్చాడు. మొండివెక్కరు, బనీను పొడవైన కాళ్లు రెక్కలు - అతడి తల్లి ఒక గిరిజన నాయకవు స్త్రీ. శివయ్య తల్లి నల్లగా కురుచగా జిత్తుల మారిలాగా వుంటుంది. శివయ్య ఆ తల్లికి పుట్టిన కొడుకులాగా వుండడు. శివయ్య తల్లి ఇంతకుపూర్వం ఊళ్లోని ఒక రెడ్డి భూస్వామి ఇంట్లో దాసిగా వుండేది. కొన్నేళ్ళ క్రితం వచ్చిన వెట్టిచాకిరి విమోచన చట్టం పేర ఆ కుటుంబాన్ని రెడ్డికుంటుంబం వదిలించుకున్నది. శివయ్య తల్లి అన్నలకు ఫిర్యాదై భూస్వామినుండి కొంత రాబట్టుకున్నది. అనేక యితర గొడవలతో ఆ భూస్వామి కుటుంబం వరంగల్ పోయింది. అప్పటినుండి శివయ్య కుటుంబం యశోదమ్మకు దగ్గరయ్యింది. శివయ్య తల్లి యశోదమ్మ ఇంట్లోపని చేస్తుంది. శివయ్య స్కూలు ఫ్యూను. స్కూలు లేని సమయాలల్లో గిర్నీలో పని చేస్తాడు. శివయ్య తల్లి అతని జీతాన్ని వడ్డీలకు తిప్పతుంది. వీళ్లను పూర్తిగా నమ్మకూడదని యశోద అభిప్రాయం.

శివయ్య "బండి మీద పోదామంటరా?" అని కృష్ణారెడ్డి వేపు చూసి పక్కనే వున్న మరో షెడ్డులోనుండి బుల్లెట్ సైకిల్ మోటర్‌ను బయటకు తీశాడు. శివయ్య నెత్తిమీద ఊగులాడే పాతకాలవు 'మేనా'ను మహేంద్ర ఆసక్తిగా చూశాడు.

శివయ్య మోటర్ సైకిల్‌ను బయటకు తెచ్చి రోడ్డుమీద నిలబెట్టాడు. అతని వెనుకనే కృష్ణారెడ్డి, మహేంద్ర వచ్చి నిల్చున్నారు.

బయట యశోద బంగ్లాకు ఎదురుగా ఎడమవేపున ఒకరైతు ఇల్లున్నది. డాబా చుట్టూ ఎత్తు తక్కువ ప్రహారిగోడ ఆ యిల్లు బందోబస్తుగానే వున్నది. ఆ ఇంటి ఆవరణలో చాలా మంది చేరి వున్నారు. మహేంద్ర అదేమిటా అని ఆసక్తిగా చూశాడు.

ఆడమగ గిరిజనులు గంపలు, పాతగుడ్డలు పట్టుకొని ఆ ఇంటి ఆసామిని కాళ్లా వేళ్లా పడుతున్నారు. 'కరవుకు పిల్లా జెల్లా మాడిపోతున్నారని' - 'అన్నకిందనే వడ్లు యివ్వండని, బీడి ఆకులన్నడు తీర్చుకుంటామని వేడుకుంటున్నారు. సన్నగా కుది మట్రంగా వున్న ఆసామి ఖమీజుకు తళతళలాడే బంగారు గుండీలున్నాయి. 'హర్జీజు' యివ్వవంటే యివ్వవని కాలం మంచిగలేదని - అయినా తన దగ్గర ధాన్యం లేదని చెప్పతున్నాడు. అతని భార్య పెద్ద గొంతుతో అదేమాట చెప్పతోంది.

"ఊళ్లె గింజలేకుంటయ్యింది. కలిగినోళ్లంత కల్లాలమీదనే ధాన్యం అమ్ముకుంటున్నరు. ఎండకాలం మచ్చిదంటే చుట్టూ దోఫసల్ పొలాలున్నా గింజకు కరవే -" శివయ్య తనకుతానే చెప్పకుంటున్నట్టుగ చెప్పి బండి -స్టార్టు చేశాడు. అక్కడి శబ్దాలకు మించి బండి డబడబ శబ్దం. శివయ్య ముందు కూర్చున్నాడు. కృష్ణారెడ్డి మధ్యలో - వెనుక మహేంద్ర.

అప్పడే పొద్దు గూకుతోంది. దుమ్ము రేగుతుండగా పశువులు మందలు మందలుగా ఊళ్లోకి వస్తున్నాయి. పశువుల అరుపులు-పశువుల కాపర్ల అప్పగింతలు - అక్కడక్కడ పశువుల మెడల్లోని చిరుగంటల మోత - బొమగల చప్పుడు ఆకాశంలోకి పొగలాగా లేచేదుమ్ము - పెంకుటిండ్ల మీద లేచే వంట పొయ్యిలపొగ...

మహేంద్ర ఏనాటిదో పాతగ్రామ జీవితపు జ్ఞాపకాలతో బందోబస్తుగా కట్టుకున్న రైతుల ఇండ్ల మధ్య నుండి సైకిల్ మోటర్ ఊరు బయటకు వచ్చింది. ఊరుకు కొంచెం ఎడంగా ఊరు కన్నా పెద్దదిగా కనిపించే నాయకపోళ్లు, ఇతర చిల్లరకులస్తుల ఇండ్ల మధ్య నుండి ఊరుదాటి అడివిదారి పట్టింది బండి.

కుడివేపునుంచి ఉత్తర దిశగా అడివి పలుచగా ప్రారంభమైనది. ఒకప్పటి ఘనాజెంగల్‌కు సాక్షీభూతాల్లాగా అక్కడక్కడమెట్టను పండభూముల్లో విషాదంగా నిలిచిన నిప్పచెట్టుల ఎడమవేపు దక్షిణ దిశగా పచ్చని వరిపోలాలు -సాయంత్రపు ఎర్రడౌలుతో - గాలికి ఆకుపచ్చ సముద్రంలాగా భ్రమగొలిపే వేసంగి పొలాలు - పొలాల మీదుగా ఎగిరే తెల్లని కొంగలు. కలుపు తీసి ఇండ్లకు వెళ్లుతున్న స్త్రీలు. వొడ్లపై వొయ్యారంగా నడుస్తూ పరాచికాలాడుకుంటూ, నవ్వుతూ పడుస్తున్నారా ఆడవాళ్లు. అక్కడక్కడ నీటిపారకం చూస్తున్న తెల్లబట్టల మగవారు వాళ్లనేదో అంటున్నారు.

దక్షిణాన దూరంగా రెండు పర్వతాల మధ్యన - రెండుపర్వతాలను కలుపుతూ రామప్ప చెరువుకట్ట - దానిమీద గుడ్డి కొంగలాగాకూర్చున తెల్లని గెస్ట్‌హౌస్ బంగ్లా. చెరువుకట్ట కిందినుండి పొలాలమధ్య నుండి అఘమేఘాల మీదుగా పాలంపేటనుంచి

ములుగువేపు ఎర్రబస్సొకటి దూసుక పోతున్నది.

ఆ చల్లని సాయంకాలపు పంట పొలాల మీదుగా వీచే పిల్లగాలులపై తేలితేలి ఆలలు అలలుగా ఎక్కడినుండో పల్లెపడుచుపిల్ల కొంటెపాట విన్పిస్తోంది.

మహేంద్ర ఆ వాతావరణంతో పులకించిపోయాడు. అతని అంతరంగంలో సుకుమారమైన చోట గెలికినట్టయ్యింది. ఎక్కడో మంట మరి ఎగదోసినట్టనిపించింది.

శివయ్య ఆ చుట్టుపక్క గ్రామాల్లోని ఇటీవలి సంచలన విషయాలను అంతూపొంతూ లేకుండా చెప్పకొస్తున్నాడు. కృష్ణారెడ్డి తనకన్నిన్ని ఆసక్తి వున్నట్టో లేనట్టో తెలియకుండా ఊకొడుతున్నాడు. చదునైన నేల మీద బండి సాఫీగా సాగిపోతోంది.

"ఆఖరుకు పనిపిల్ల కోసం తానీ అడువుల్లోకి రావల్సి వచ్చిందన్నమాట" మహేంద్ర మనసులో అనుకున్నాడు.

నాలుగు రోజుల క్రితం పని పిల్ల విషయంలో భార్యతో జరిగిన దెబ్బలాటలో తన సర్వశక్తులు కూడదీసుకొని స్పష్టంగానే చెప్పాడు. 'ఇంత హింసతో ఇట్లా కలిసి బతకడం' కన్నా విడిపోవడం మంచిది. ఈ ఇంట్లో నీకేది కావాలన్నా తీసుకపో' అని. తను ఆవేశంతో అన్న మాటకాదది. ఎంత కూడదీసుకున్నా కూడా తానామెతో కలిసి ఆ హింస నిత్యము నిరంతరం అనుభవించ జాలడు. కాదుకూడదని ఆమెపైన హింసను ప్రయోగించి సుఖపడజాలడు. విడిపోవడమొక్కటే పరిష్కారం. లేకపోతే భరించరాని ఈ టెన్షన్‌లో తానామె గొంతు పిసికి చంపాలి. లేదా తానే ఆత్మహత్య చేసుకోవాలి. ఈ రెండూ జరుగరానివే - అందుకే విడిపోవాలి.


పనిపిల్లను పెట్టుకుంటే తప్పేమిటంటాడు కృష్ణారెడ్డి. పైగా ఈ రసరస తప్పతుందంటాడు. నిజానికి తాను పనిపిల్లను పెట్టుకోవడానికి వ్యతిరేకి కాదు. కాని పని పిల్లను మనిషిలాగా చూస్తుందా? తన ముందు ఆ పిల్లను హీనంగా చూస్తే తను భరించలేడు. తనకు పనిలో సహాయమే కావాలంటే తన తల్లి గ్రామంలో ఒంటరిగా వుంటోంది. అది తెలియనట్టే వుంటోంది.దానర్థమేమిటో తనకు తెలుసు ఆమెకు తెలుసు. ఇంతకూ గొడవ పని దగ్గర కాదు. పనిపిల్లతో పరిష్కారం కాదు. జీవితం పొడుగుతా ఎన్ని విషయాల మీద నిరంతర గొడవలు జరుగలేదు. తనకు స్పష్టంగా తెలుసు. పనిపిల్లను పెట్టుకోవడంతో గొడవ స్వరూపం మారుతుంది. స్వభావం మారదు. పైగా వున్న గొడవలకు తోడు పనిపిల్ల గొడవ కొత్తగా వచ్చి చేరుతుంది. ఆ పసిపిల్ల నలుగుతుంది.

ఊరికి బయలుదేరేటప్పడు కృష్ణారెడ్డి పనిపిల్ల విషయమే చెప్పలేదు. యశోదమ్మ మాట్లాడేదాకా తాను అందుకోసమే ఈవూరు వచ్చిన సంగతి తెలియదు.

హాయిగా రెండు రోజులు పల్లెటూల్లో గడిపి వద్దాము. ఇట్లా గొడవలు పడి ఒంటరిగా వుండడం మంచిది కాదు. మా అక్కయ్య ఊరు మంచి పర్యాటక స్థలం. కాకతీయుల సామ్రాజ్య కాలంనాటి పెద్ద చెరువున్నది. చూసి తీరవలసిన శిల్పకళ గల్గిన గుడులు వున్నాయి" బస్సులో భార్యాభర్తల గొడవలు - లౌక్యం, అడ్జెస్టుమెంటు వగైరా చెప్పాడు. మాట వరుసకు ఇక్కడ గిరిజన పిల్లలు దొరుకుతారని తక్కువ యివ్వడం గురించి చెప్పకొచ్చాడు.

ఔను కాదనకుండానే - తను పనిపిల్లను ఏకంగా చూడబోతున్నాడు. తన ఇష్టాయిష్టాలు అన్నీ కలగలిసి అలుక్కుపోయిన స్థితి. వద్దనడం కాదనడం ఇక తన వల్ల కాదు. ఎటో ఓ వేపు కదలాలి. వున్నచోటనే వుంటే మనిషి బతుకలేడు.

మహేంద్ర ఒక నిర్ణయానికి వస్తున్న సమయానికి బండి ఒక చిన్న వొర్రె (వాగు) ఒడ్డుదాకా



వెళ్ళి ఆగింది. ఆ వాగు వొడ్డు మీద కాముగు, తీగదారు పొదలు గుబురుగా వున్నాయి. ఆ పొదలపైన కొడిశె, పాల కొడిశె, తునికి చెట్లు చిగురిస్తూ వున్నాయి. అక్కడక్కడ టేకు చెట్లు ఆకులురాల్చి మోడుల్లా నిలుచున్నాయి. ఆ వాగు ఆ పాతకాలపు చెరువు కింది నుంచి వచ్చే వాగు దగ్గరికి వెళితే తప్ప అక్కడ వాగున్న సంగతే తెలియదు.

ముగ్గురు బండి దిగారు. శివయ్య బండిని దారిపక్క నిలిపి స్టాండేశాడు. అక్కడి నుండి బండి నడవదు. అడివిలో పది నిమిషాలు నడిస్తే 'దుంపగూడెం' వస్తుందని శివయ్య చెప్తున్నాడు.

మహేంద్ర సాగిసాగి ఆగిన ఆలోచనల మధ్యనుండి – సాగి సాగి చిక్కుపడే స్థితికి తన మీద తనకే చిరాకు, అసహ్యం వేస్తుండగా ఊరికే వారిద్దరి వెంట నడుస్తున్నాడు. అతని మనసులో అంతులేని, ఎడతెగని సందిగ్ధ సంఘర్షణ – గాయం తెలియని నొప్పి మాత్రం ఒళ్ళంతా పాకిన సంకుల సంఘర్షణ.

ముగ్గురు కలిసి నాల్రైదు పదడుగులు వేశారో లేదో చేతుల్లో పెద్ద స్టెన్‌గన్‌తో ఎర్రముఖపు సైనికుడు హఠాత్తుగా వాగు వొడ్డు గుబురు పొదల్లోంచి దూసుకువచ్చి ముగ్గురికీ గురిపెట్టాడు. వెనుక నేపు నుండి ఆదరబాదరాగా బూట్ల చప్పుడు మరో నలుగురు – వాళ్ళ వెనుక మరి కొంత మంది సరిహద్దు భద్రతా దళం జవాన్లు–

శివయ్య అందులో ఒక అధికారికి నమస్కారం పెట్టాడు. శివయ్య మాటలను బట్టి ఆయనే ఆ ప్రాంతపుసర్కిల్ ఇన్‌స్పెక్టరని తెలిసింది. సర్కిల్ జవాన్లకు ఏదో హిందీలో చెప్పాడు. జవాన్లు మిర్రి మిర్రి చూస్తూ ముందుకు కదిలారు. ఉప్పతేలిన బట్టలతో అలిసి కమిలిన ముఖాలతో ఆ సైనిక పటాలం ఈడ్చుకుంటూ తుపాకులు మోసుకొని తూర్పునేవున్న మండల కేంద్రం వైపుకదిలారు. వారితోపాటు ఇద్దరు గిరిజన యువకులు బందీలై నడుస్తున్నారు.

మహేంద్రకు కడుపులో తిప్పతోంది. తన చుట్టూ ఆవరించియున్న ప్రపంచం భీకర యుద్ధంలో వున్నది. ఒకటిగా కన్పించే ప్రపంచం రెండుగా చీలి తలపడుతున్నది. లోపల అంతే – శివయ్య కృష్ణారెడ్డి ముందు నడుస్తున్నారు. మహేంద్రకు ఆ యిద్దరు గిరిజనుల ముఖాలు కన్పిస్తుండగా వెనుక నడుస్తున్నారు.

పైన జుమ్మని ఈగల మోత– అడవి తనదైన కంఠస్వరంతో ఏదో చెప్తోంది. చెట్ల కింద చీకటి చోటు చూసుకుంటోంది. చెట్ల కొనల మీద సాయంకాలపు చిత్రమైన వెలుతురు దోబూచులాడుతోంది.

శివయ్య ఇందాకటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గురించి వీరోచితంగా చెపుతున్నాడు. శివయ్య మోహరించి వున్న రెండు ప్రపంచాలల్లో అటు కాసేపు ఇటు కాసేపు ఊగుతున్నాడు.

అతను అవటానికి 'ఎస్సీ' వాడైనా రెడ్ల, తీరుగ, వెలమల తీరుగ మాంచి ధైర్యస్తుడనీ, ముగ్గురు నలుగుర్ని వేసేసి ప్రమోషన్ కొట్టు కొచ్చిండనీ బాగా సంపాయించగలిగాడని – హనుమకొండ రెడ్డి కాలనీలో మన బావ ఇంటి పక్కనే బ్రహ్మాండమైన బంగ్లా కడుతున్నాడని, మన బావకు మాంచి దోస్తనీ – ఊళ్ళెకువస్తే మనింటికి వచ్చి ఛాయ్ తాగనిది పోడనీ...

శివయ్య బతికే బతుకుకు అతని కలలకు వుండే సంబంధం గురించి మహేంద్ర ఆలోచిస్తున్నాడు. తల మీద జుయ్యిమనే ఈగలనుచేత్తో తోలుకుంటూ మహేంద్ర నడుస్తున్నాడు. జీవితాన్ని కొనసాగించలేని ఒకానొక దుర్భర స్థితి మళ్ళీ అతని మనసులో సుళ్ళు తిరుగసాగింది.

పనిమనిషి ప్రస్తావన వచ్చినప్పుడల్లా మహేంద్ర ఎన్నోమార్లు అనుకున్నాడు. ఇద్దరు ఉద్యోగాలకు పోయిన తరువాత పిల్లలను చూసుకోవడానికి తన తల్లిని తీసుకు వద్దామని మహేంద్ర – తీసుకవచ్చినా పని మనిషి అవసరమని అతని భార్య – అన్యాపదేశంగా తన తల్లిని వద్దనడమేనని మహేంద్ర భావన.

"నిజంగా తమిద్దరి మధ్య గొడవ పనిపిల్ల దగ్గరే ప్రారంభమైనదా?" మహేంద్ర అనేక సందర్భాలలోలాగానే ఈ ప్రశ్న వేసుకున్నాడు.

శివయ్యా, కృష్ణారెడ్డి ఇద్దరూ అంతూ పొంతులేని సంభాషణ సాగిస్తూనే ముందు నడుస్తున్నారు. లోపల ఇద్దరి ప్రపంచాలు వేరు. అయినా పైన ఏ బేధాభిప్రాయాలు లేనట్టే మాట్లాడుకుంటున్నారు. అంతర్లీనంగా వాళ్ళ ప్రపంచాల సరిహద్దులు కలుస్తాన్నాయేమో? తనెందుకు వాళ్ళ మాటల్లోనైనా కలువడు?

## స్కెచ్

పొద్దుగాటి ప్లాట్‌ఫాం అంచు
రెండో మూడో ఖాళీగా కూచున్న సిమెంటు బెంచీలు
వాటి మీదకు వంగి గుసగుసలాడబోయే రైలు చెట్లు
పక్కనే.... చెట్టపట్టాలేసుకుని
నిశ్చలంగా పరిగెత్తురుపోయే పాముల జత
విశాలమైన కుటీరం లాంటి షెడ్డు
నీడ లివాసే పరుచుకుని
అన్నీ వదులుకున్న మునిలా
కళ్ళు మూసుక్కూచున్న బిచ్చగాడు
ఊరూ కాని అడవీ కాని అదో ప్రపంచం
ఏకాకి కాకి అరుపు తప్పిస్తే
అచ్చం చిన్న స్కెచ్‌లా వుంటుంది
కేన్వాస్‌లో ఉన్నట్టుండి రంగులు మారతాయి
మనుషులు మనుషులుగా ఖాళీలు నిండుతూ
మధ్య మధ్య మూటలూ పెట్టెలూ చేరుతూ
నెమ్మదిగా చిత్రానికి జీవం వస్తుంది
చైతన్యానికి పరాకాష్ఠలా రైలుబండొస్తుంది




ప్లాట్‌ఫాం మీద కెరటాలు కెరటాలై
'జోష్'లూ, 'సారో'లూ హడావిడి పడతాయి
సలహాల్నీ భరోసాల్నీ
దిగుళ్ళనీ కేరింతల్నీ
కిటికీలు ప్రేక్షకులై చూస్తుంటాయి
వ్యథార్త హృదయాల ఆవేదనకో
యథార్థ చిత్రాల ఆనందానికో
కదిలిపోతుంది రైలు... వెర్రి గొంతుక విచ్చి మోగుతూ

ఒక పచ్చ జెండా
అనేక మైత్రీ హస్తాలుగా రెపరెపలాడుతుంది
కళ్ళ చెమ్మకి రైలు బొమ్మ చెరిగిపోతుంది
హఠాత్తుగా తాకిన మౌన భారానికి
గుండె గోడలు కొంచెంగా కంపిస్తాయి
శిశిర పత్రాల్లాంటి మనుషులు చెదిరిపోయి
మోడు చెట్టులాగా
మళ్ళీ స్కెచ్‌లా నిశ్చలిస్తుంది ఆ చిన్ని ప్రపంచం
స్కెచ్ చిన్నదే
ఇచ్చే అనుభూతి గొప్పది... ప్రతిసారీ...

డా. రెంటాల శ్రీవెంకటేశ్వరరావు

# ఊరేగింపు



ఆయన చేసిన ప్రజాసేవ యేమిటో
ఆయనకైనా తెలుసునో తెలియదో!
అందరికీ తెలిసిన విషయం ఒకటుంది
ఆయన ఏదో పదవిలో ఉన్నాడని
అది చాలదా ఆ పెద్ద ఊరేగింపుకి?!
ఆ ఊరు ఒకపాటి నగరం
అభిమానులంతమంది ఎలా గుమిగూడారో!
జనాభాని మించిన జనం కనిపిస్తున్నారు
అజగరాన్ని తలపించే ఆ ఊరేగింపులో
అరవై యేళ్ళు నిండాయట ఆయన జన్మించి

కుక్కిన పేలను గుర్తుకి తెచ్చేలా
ఎక్కడి బస్సు లక్కడే గప్‌చిప్–
ఒక్కసారిగా గుండె ఆగిపోయినట్టుగా
అదిమిపట్టి పీకె నులిమినట్టుగా
ప్రేతకళ వచ్చింది చైతన్యానికి!

నినాదరూపంలో హరించుకుపోతోందా
వినూత్నతకు మొగ్గలు తొడిగే జనశక్తి?
పని పాటలు నిర్లక్ష్యం చేసే దృఢకాయులు
వేనకు వేలుగా ఉన్నారా మన దేశంలో?
అనిపించింది ఊరేగింపు చూసే కొద్దీ

ఆసుపత్రిలో ఉన్న మా అమ్మాయిని
ఆలనా పాలనా చూసేవారు వేరు
ఆమెను చూడాలని వెడుతున్న నేనేమో
అఘోరిస్తున్నా ఆగిపోయిన ఈ బస్సులో–
అని ఒక ఇల్లాలు మునిగింది విషాద యోగంలో!

ఎవరినీ లెక్క చెయ్యని కాల పురుషుడు
దవుడు తీస్తున్నాడు పుట్టి మునిగినట్టుగా
చేతి గడియారం మాటి మాటికి చూస్తూ
ఇక శరణ్యం రేపటి రైలే అనుకుని
వృద్ధుడొకడు మునిగాడు విషాద యోగంలో!

అతి కష్టం మీద దొరికిన నెల రోజుల సెలవులో
అప్పుడే గడిచాయి మూడు రోజులు ప్రయాణంలో
అరగంట ఆలస్యంగానైనా రైలు చేరింది
ఆటో దొరకని నేనెలా ఇల్లు చేరుకుంటానని
సైనికోద్యోగి మునిగాడు విషాద యోగంలో!

ఇంకా ఎందరెందరు విషాద జలధిలో
ఈదులాడుతున్నారో తెలుసునా నాకు?
తెలిసి మాత్రం ఆర్చే వాడినా తీర్చేవాడినా!
పేదవాని కోపం పెదవి చేటంటారు
ఎవరికైనా తెలుస్తుందా సామాన్యుడి ఘోష?

– చల్లా రాధాకృష్ణశర్మ

మహేంద్ర లోపల ఆకారంలేని అనేక విషయాల ఒత్తిళ్ళ మధ్య యాంత్రికంగా నడుస్తున్నాడు.

తానెందుకిట్లా అర్థం పర్థం లేకుండా గాలివాటుగా తిరుగుతున్నట్లు?

కృష్ణారెడ్డి లాక్కొచ్చాడు. అతను లాక్కు రావడం కన్నా – ఇష్టమో అయిష్టమో ఆ ఏకాంత విషాద దుఃఖకర పరిస్థితుల్లోంచి బయట పడాలి. వొచ్చాడు.ఇక్కడ మళ్ళీ ఎదురైంది పనిపిల్ల. పోనీ పనిపిల్లను పెట్టుకుంటే తామిద్దరు భార్యా భర్తల మధ్య ఘర్షణ తగ్గుతుందా? కొంత తప్పుతుందంటాడు కృష్ణారెడ్డి. కాని ఇలాంటివి ఈ ఎనిమిదేండ్ల దాంపత్యంలో ఎన్ని చూడలేదు. అనుభవించలేదు. అనేక విషయాల మీద 'మసిలీ మసిలీ' ఏదోరూపం తీసుకుని బయట పడుతుంది. బయటకు కన్పించేది ఒక నెపం మాత్రమే. ఒకదాని తర్వాత మరొకటి. – చీరలు, గృహోపకరణాలు – లగ్జరీ వస్తువులు డబ్బు సంపాదన – షేర్లు, ఇల్లు కట్టుకోవడం – నగలు – గ్రామంలోని ఆస్తిపాస్తుల వివరాలు–

వీటన్నిటిలో తను ఇంతో అంతో మునిగి తేలుతూనే వున్నాడు. తన రెక్కల కష్టం మీద ఒక్కొక్కటీ సమకూర్చుకొంటున్ననే ఆ ప్రయత్నం తను చూస్తున్నదే.

మరి ఘర్షణెక్కడ? తనను ఇంతవాన్ని చేసిన మనుషుల పట్ల ఒక విధమైన ఏవగింపు. తనకు తమరెక్కల కష్టం ధారపోసి పెంచిన వారికి ఏదైనా అవసరం పడి సాయం చేస్తే, చేసినట్టు తెలిస్తే మనిషి ముఖమే మారిపోతుంది. తను కావాలి. బహుశా అవసరాలు తీర్చే తను కావాలి. తన సమస్త శరీరం నిండా అల్లుకపోయిన తన వారెవరైనా ఇంటికి రాకూడదు. వచ్చినా మామూలుగా బయటపడాలి.. తనకు సంబంధించిన ప్రతి విషయాన్ని ఎందుకిట్లా వ్యతిరేకిస్తోంది. తను తాగలేదు, తినలేదు, దుబారా ఖర్చులు చేయలేదు. తను తల్లి పేగు సంబంధాలన్నీ తెంచేసుకొని – అక్కడ ప్రారంభమై తన సమస్త చర్యలతో, స్వభావంతో విభేదిస్తోంది. తన అన్ని చర్యలద్వారా హింసిస్తోంది.

ఈ సక్లిష్ట స్థితిలో తను చేయగలిగిందింకేముంది.

మహేంద్ర కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. తనకు తానే ఆపాద మస్తకం నీళ్ళు నిండిన కళ్ళతో చూసుకున్నాడు. ఎందరి రక్త మాంసాలు అద్దుకొని తానీ స్థితికి వచ్చాడు.

దుమ్ముకొట్టుకపోయిన పాదాలపై కన్నీటి బిందువులు టపటపా రాలిపడ్డాయి.


తనను తాను సంబాళించుకోవడానికి కన్నీళ్ళు చూపుడు వేలుతో తుడుచుకున్నాడు.

ఈ హింసా దాంపత్యాన్ని తానెంత కాలం కొనసాగించాలి?

ఉదయం ఎట్లాగో చిటపటల మధ్యనే ప్రారంభమౌతుంది. ఎక్కడ బద్దలవగలనోనని వీలై నంత మేరకు తాను మౌనంగానే వుందామనుకుంటాడు. మాటలవల్లా, చర్చలవల్ల తేలే విషయాలు ఇందులో ఏమున్నాయి?

పాత్రలు ఎత్తేయడం, పిల్లల మీద విసుక్కోవడం, కొట్టడం – అక్కడికి తను సాధ్యమైనంత వరకు పనులుచేస్తూనే వుంటాడు. నిప్పుల మీద నిల్చున్నట్టుగానే ఉద్యోగంలోకి బొగ్గుగనిలోకి పోతాడు. అదొక దిక్కుమాలిన ఉద్యోగం. సరైన సామాను యివ్వరు. ఉత్పత్తి గురించి ఒత్తిడి – సామాను గురించి, వర్కింగ్ కండీషన్ గురించి అడిగితే గని మేనేజరుదొక భరించజాలని అధికారం.

ఆశ్చర్యం! తనకు మేనేజరును చూస్తే భార్య జ్ఞాపకం వస్తుంది. ఇంట్లో చేసే సంసారానికి – బయట చేసే ఉద్యోగానికి ఏ తేడా లేదు. ప్రత్యర్థులిద్దరు ఎదురు బొదురుగా నిల్చున్నట్లు –యుద్ధం బాహా బాహీ జరుగదు కాని భరించరాని హింస – ఎన్ని విషయాలు కలిస్తే మనిషి మరో మనిషితో కలుస్తాడు. ఎన్నో ముక్కలైన మనుషులు, అందులో శరీరంతో కలవవల్సిన




మనుషులతో - మరెన్ని సారూప్యభావాలు కావాలి.

పగలల్లా మందిలో కాలం - అంతర్లీనంగా విషాదం, పైకి ఆనందం. ఎట్లాగో దొర్లిపోతుంది. సాయంత్రం లోకంపై చీకటి తెరలుజారినట్టుగానే - లోలోపలి అవయవాలను రంపపుకోత కోస్తున్నట్టుగా ఆరంభమౌతుంది యాతన. దేహంలో నుండి ఏ భాగానికాభాగం ఊడిపోతున్నంత బాధ. ఆ తీవ్రత అంతకంతకూ హెచ్చుతూ వుంది. నిలువనీయని తుఫానేదో చుట్టు ముడుతుంది. ఏదో పెనుగులాడుతుంది. ఊరికే ఇంట్లోంచి రాత్రిళ్ళు వీధుల్లో సంచరిస్తుంటాడు. మిత్రుల ఇండ్లకు వెళ్ళకూడదనుకుంటూనే వెళ్తాడు. ఏవో సగం సగం మాటలు - సగం సగం మనుషుల అసంబద్ధ ప్రవర్తన - అంతా పరమ లౌక్యంగానే కన్పిస్తారు.

మొలగుడ్డలు తప్ప అంగీలు లేని అయిదారుగురు పురుషులు వాళ్ళ వెంట ఒక కురచ ముసలమ్మ వాళ్ళలో వాళ్ళు మాట్లాడుకుంటూ ఎదురయ్యారు.

శివయ్యను గుర్తుపట్టి సర్పంచ్ గురించి అడిగారు.

ఆ స్త్రీ "తన కొడుకునేం చేస్తారో?"నని బొలబొల ఏడ్వసాగింది.

అందులో ఒకడు ఆ ముసలవ్వను సముదాయిస్తున్నాడు.

పోలీసులు పట్టుకపోయిన ఆ యిద్దరు యువకులను విడిపించగల శక్తి వాళ్ళల్లో ఎవరికి లేనట్టే వున్నది. కాని వాళ్ళు ఏ ప్రయత్నమైనా చెయ్యాలని బయలుదేరారు.

ఇంతదాకా సర్కిల్ శౌర్యాన్ని వర్ణించిన శివయ్య వాళ్ళకు ఏవో రీతులు, యుక్తులు చెప్తున్నాడు. వాళ్ళు శివయ్యను వెంటరమ్మన్నారు. శివయ్య "వస్తినా" అన్నాడు.

మళ్ళీ ముగ్గురు నడుస్తున్నారు. మహేంద్ర వెనుతిరిగి చూశాడు.వాళ్ళ అడుగులు అంత కంటే మిక్కుటమైన బాధతో రాత్రి పదింటికో ఆ పైన్నో ఇళ్ళు చేరడానికి వేసే తన అడుగుల్లాగే వున్నాయి.

మహేంద్రకు ఒంటరిగా బలవంతంగా తినే తిండి జ్ఞాపకం వచ్చింది. శరీరంలోని సర్వశక్తులు హరించకపోతుంటే మంచంపైకి చేరడం - పాము కదలికల మాదిరిగా తన పక్కన భార్య. తన నొక కొండ చిలువ చుట్టుకునే గగుర్పాటు. పాము బుసల మాదిరిగా ఆమె ఊపిరి తన ముఖంపైన-అప్పుడు కళ్ళల్లోనే కాదు శరీరమంతా కన్నీరు తిరుగుతుంది.

హఠాత్తుగా తనకు చావు జ్ఞాపకం వస్తుంది. చెరచెర నేల పగిలి తాను అందులోకి కూరుకుపోతే బావుండనన్పిస్తుంది.

అప్పుడు తన శరీరం తనకే అసహ్యంగా తోస్తుంది.

నడుస్తున్న మహేంద్ర శరీరం నిలువెల్లా సనసన్నగా కంపించడం ప్రారంభమైంది. ఇట్లా శరీరం తరుచుగా గజగజ వనుకుతూనే వున్నది.

ఆ ప్రకంపనాల నుండి బయట పడటానికి మహేంద్ర ఇంకోనేవు ఆలోచించసాగాడు.

అసలు తానొక్కడే ఇట్లాంటి యాతన అనుభవిస్తున్నాడా? ఇలాంటి ఛండాలపు జీవితానుభవం తనొక్కన్నే చుట్టు ముడుతున్నదా? చుట్టున్న జీవితం చూస్తుంటే కాదని తోస్తున్నది.

నిత్యం కాలరీ ఏరియాలో జరిగే స్త్రీల ఆత్మహత్యలు - పురుషుల హత్యలూ - ఎక్కడో బద్దలయ్యే అనేక గొడవలు - కొట్లాటలు - బయట వీటన్నిటి పతాక స్థాయి అనదగిన సంకుల సమరం జరుగుతోంది. అదీ స్వాహలోకి వస్తూనే వుంది.

అంత పెద్ద బంగ్లా - అన్ని అజమాయిషీలు చేస్తున్న యశోదమ్మ - ఆమె భర్తా కారణాలేమైనా ఒకే దగ్గర కలిసి వుండడం లేదు. ఆమె ముఖంలో ఇలాంటిదేదో రూపు కుదుతూనే వున్నది.

ఎందువల్లనో సరిగా తెలియదు. ఒకొక్కమారు ఈ సంఘర్షణ ఎక్కడ మొదలై ఎందువల్ల బతుకు పొడుగుతా సాగుతుందో తెలిసినట్టే అన్పిస్తుంది. ఒక్కొక్కమారు పూర్తిగా మసక కమ్మినట్టు తోస్తుంది.

తను ఆమెను కలవడం కోసం తనను తాను ఎంత సంసిద్ధపర్చుకోవాలి. తన శరీరాన్ని పోటెత్తే మనసును హింసించుకోవాలి. తన మనసు ఒత్తిళ్ళన్నీ శరీరం భరించి, భరించి శిథిలమౌతోంది.

అయినా తాను ఆమెను కలవజాలడు. దగ్గరౌదామన్నా కొద్దీ దూరం పెరుతుంది. ఈ పనిపిల్లతో తన సమస్యలు తీరేవికావు. సంఘర్షణలు ఆగేవి కావు. మరో చోట - ఇంకో చోట మొదలౌతుంది. మసిలి మసిలి బద్దలౌతుంది.

ఈ అదువులు పట్టుకు తిరగడం వృధా ప్రయాస.

మహేంద్రకు తన మీద తనకే కోపం కలిగింది.

"ఏది ఏమైనా అంతగా ఆలోచించి మనసు పాడు చేసుకోవడం మంచికాదు. కృష్ణారెడ్డి ముందు పోతున్న వాడల్లా ఆగి మహేంద్ర భుజం మీద చేయి వేసి కళ్ళలోకి చూశాడు.

"ఆలోచించడం - ఆలోచించకపోవడం గురించి ఇతను తనకు చెప్తున్నాడు" మహేంద్ర పెదవులపైనవ్వు.

అంతలోనే నవ్వు అంతలోనే విషాదం- వానాకాలపు ఎండలాగా కృష్ణారెడ్డికి అర్థమే కాలేదు.

"ఇదే దుంప గూడెం" శివయ్య ముందు పోతున్న వాడల్లా ఆగి అన్నాడు. కొన్ని చెట్లు ఆకులు చిగిర్చి - మరికొన్ని చెట్లు మోడువారి ఆ అడవి మధ్యన ఆ గూడెం సుఖ దుఃఖాల సంగమంలాగున్నది. దారికి రెండు వైపుల గుడిసెల వరుసలు - కప్పులు చిరిగి, దళ్ళు చెరిగి - కూలిన గోడలతో, చిరిగిన తడికెలతో ముప్పై నలుభైదాకా ఇండ్లుండవచ్చు. వాళ్ళకు ప్రకృతిలోని ఎండా, వాన, చలి అన్ని సమానమే. పోగు పడ్డదిగాని, దాచుకోవాల్సిందేమి లేక ఇండ్లు అజారు బజారుగానే వున్నాయి.గూడెం గూడెమంతా బెగ్గం పాడై వుంది.

పిల్లా పీచు, స్త్రీలు, వృద్ధులూ వీధిలోచేరి గోలగోలగా అరుస్తున్నారు. అక్కడక్కడ ఒకరిద్దరుఏదుస్తున్నారు. ఒకరి దెబ్బలు ఒకరుచూసుకుంటున్నారు. గుడ్డపేగులతో కట్లు కట్టుకుంటున్నారు. మరి కొందరు ఎవరినో తిడుతూ ఓదారుస్తున్నారు. స్త్రీలు కొందరు కనపడని సర్కారును శాపనార్థాలు పెడుతున్నారు.

గుడిసెల కప్పులు,. పెంకులు అక్కడక్కడ పీకి వేయబడి వున్నాయి. ఇండ్లల్లోని కుండలు, సత్తుబోళ్ళు వీధిలోకి విసిరివేయబడి వున్నాయి.కోళ్ళు, మేకలు చెదిరిపోయి అరుస్తున్నాయి. కుక్కలు వీళ్ళ ముగ్గురిని చూసి మళ్ళా మొరుగుతున్నాయి.

తన దురదృష్టమేమిటో కాని ఎక్కడ యుద్ధ రంగమే ఎదురౌతూంది. ఎక్కడా సందిగ్ధయా తన ఎదురౌతూనే వుంటుంది. విధ్వంసమైన ఆ గూడెంలో గాయబడిన ఆ గూడెంలో తన పని పిల్ల కోసం వెతకడం ఎంత అసహజమైంది?

"ఇందాకటి పోలీసోల్లు రైడ్ చేసినట్టున్నది" సంధ్య సందిగ్ధ వెలుగులో శివయ్య చిందర వందరగా వున్న ఆ గూడెంలో నడుస్తూ అన్నాడు.

కృష్ణారెడ్డి ఏదో అన్నాడు.

మహేంద్ర ఏమనలేదు. తన లోపలా బయటా ఒక్కలాగే వుంటే అనడానికి ఏమున్నది?

వాళ్ళు ముగ్గురిని గుడెంలోని వాళ్ళు అనుమానంగా చూశారు. శివయ్య ఎవరితోనో మాట కలిపాడు.

"మనం చూసిన ఆ యిద్దరూ ఈ గూడెం వాళ్ళే" శివయ్య చెప్పి మరింత ముందుకు నడిచి ఒక శిథిలమైన గుడిసె ముందు ఆగాడు. ఆ గుడిశె ముందు ఎముకల పోగులాంటి ముసలివాడు నిర్వికారంగా ముడుచుక కూర్చున్నాడు. శివయ్య ఆ ముసలివాన్ని పేరుపెట్టి పిలిచి ఏదో చెప్పాడు.

కొద్దిసేపు ఆ వృద్ధుడు మహేంద్రను, కృష్ణారెడ్డిని నిరాసక్తంగా చూశాడు. తరువాత ఏదో పేరుతో పిలిచాడు.

భయం భయంగా నిలబడి వచ్చిన కొత్తవాళ్ళను చూస్తున్న ఎనిమిదేండ్ల అమ్మాయి ఆ


# బేతాళ గీతం

చల్లటి గాలికి ఎదురుగా నడిచిపోతున్నప్పుడు ఒక నలుసుకంట్లో పడుతుంది.
చంద్రుణ్ణి వేలితో నులిమి సూర్యుణ్ణి చేస్తాను.
స్వచ్ఛస్ఫటిక జలపాతంలోంచీ ఒక సర్పపతనం దృశ్యాన్ని మలినం చేస్తుంది.
స్నేహం కోసం చాచిన చేతిని ఎంతసేపటికీ శూన్యమే స్పర్శించడం నిజంగా విషాదమే!
మనం నవ్వడానికి ప్రయత్నిస్తాం
ఎదుటి వాడి ఏడుపు ఏరులా చుట్టుముడుతుంది.
రోజంతా శ్రమపడిగీసిన సంధ్యాచిత్రంపై చినుకులు పడి రంగులన్నీ కొట్టుకుపోతాయి.
కోరికల అందం తాజాదనం కోల్పోకముందే నైరాశ్యం మింగేస్తుంది.
ఆకాశంలో ఎగురుతూ హఠాత్తుగా రెక్కలు విరిగి
భూపతనమైన వాళ్లని ఎందర్ని చూడలేదు!
నిరామయంగా నిరాలోచనగా వున్నప్పుడు
నా కళ్లముందు కదిలిపోయిన చీమ, కాళ్ళతో నన్ను తొక్కుకుంటూ పోతుంది.
అవ్యక్తం మొద్దుకత్తై నల్లని నా గుండెపై తనకు తానే పదును పెట్టుకుంటుంది.

* * *

నా పొలాల్ని వెంట తీసుకుని, నా ఆకాశాల్ని మోసకుని
నా పాటల్ని తోలుకుని నా దారి నేను వేసుకుంటూ పోతుంటే
సీసా మూతవిప్పి ఎవడో తుఫానుల్ని నాపైకి వుసికొల్పుతాడు
మళ్ళీ నేను మొదలుపెట్టి
నా పొలాల్ని వెతుక్కోవాలి!
నా ఆకాశాల్ని అన్వేషించాలి!
నా పాటల్ని పట్టుకోవాలి!

—సౌభాగ్య



వృద్ధుని పక్కవచ్చి నిలుచున్నది.

ఆ పిల్ల సన్నగా, పల్లగా తిండి తిప్పలు సరిగా లేక ఎముకలు తేలి కన్పిస్తున్నది. బట్టలు చిరిగున్నాయి. జుట్టు పరికి కంపలాగా రేగి వున్నది. కళ్ళల్లో ఏ భావముందో తెలియలేదు.

మహేంద్రకు తన పెద్ద కూతురు జ్ఞాపకం వచ్చింది.

"ఇక్కడుంటే పోరి సచ్చిపోద్ది. తిండి కరువు – చూసేవాళ్ళులేరు. ముసలోడు అట్లా వున్నాడు. మనం తీసుకపోతే కనీసం బతుకుతుంది" కృష్ణారెడ్డి మహేంద్రకేసి చూస్తూ-

వృద్ధుడు చేతులు జోడించాడు. అతని కళ్ళల్లో వందల వేల సంవత్సరాల వారసత్వపు దుఃఖావేశాలు.

అన్నీ తెలుస్తూనే వున్నాయి. రంపపుకోత మరింత హెచ్చి మహేంద్ర మౌనంగా వెనుదిరిగాడు.

"రేపు పొద్దున్నే ఎండకాక ముందు పొల్లను తీసుకరా- సార్లు అన్నం తిన్నంక వెళ్ళిపోతరు" శివయ్య చెప్పాడు.

వృద్ధుడు ఏమీ మాట్లాడలేదు.

"ఏం రంధి పెట్టుకోకు. పొల్ల అస్సలుగ బతుకుతది"శివయ్య ముసలివానికి నచ్చ చెప్తున్నాడు. మహేంద్ర వెనుక నడుస్తూ కృష్ణారెడ్డి ఆ పిల్ల గురించి ఏదో చెప్తున్నాడు.

అప్పటికి దండకారణ్యం పైన పొద్దు పూర్తిగా కూకింది. పడమటి ఆకాశం రక్తం వరదలై పారిన యుద్ధ భూమిలా ఎర్రగా వుంది. తూర్పున దిగంతాల అవలినుండి చీకటి తెరలు తెరలుగా కమ్ముకవస్తోంది. చెట్ల ఆకులను ఊపుతూ సన్నగా గాలితోలడం ప్రారంభమయ్యింది.

** ** **

ఊళ్లోనూ – ఇండ్లలోనూ కరంటు బుగ్గలు వెలిగి చాలా సేపయ్యింది. రాత్రి పూట అన్నాలు అడుక్కునే చాకలి వాళ్లు ఊరుతిరిగి పోయారు. రైతుల ఇండ్లల్లో పాలేరు పనులు చేసేవాళ్లు ఊరవతలి వాయికపోళ్ళ వాడకేసి దాని పక్కనేగల మాదిగిండ్ల కేసి పోతున్నారు.

రైతుల ఇండ్లల్లో రాత్రి భోజనాలు ఆరంభమయ్యాయి.

డాబాముందు గద్దెమీద కూర్చున్న మహేంద్రకు లోపలినుండి పాలేరు పిలగాని ద్వారా భోజనానికి కబురొచ్చింది. అనేక వరుస దరువాజలను దాటుకుంటూ మహేంద్ర భోజనాల గదిలోకి అడుగుపెట్టాడు. ఆ గదిలో జిట్రేగు కర్రతో చేయించిన డైనింగ్ టేబుల్ కుర్చీలు నల్లగా నిగనిగ లాడుతున్నాయి. ఒక కుర్చీలో కృష్ణారెడ్డి కూర్చుండి అక్క యశోదతో మాట్లాడుతున్నాడు. మహేంద్రకు కుర్చీ చూయిస్తూ "కూర్చోండయ్యా!" అంది యశోద.

డైనింగ్ టేబుల్ మీద అప్పటికే అన్ని పదార్థాలు వడ్డించి వున్నాయి. అప్పుడే వండిన కోడి మాంసం, దానికి తోడు ఉదయాన వారు వండుతున్న బెండకాయ వరుగుల పులుసుకూర, రకరకాల పచ్చళ్లూ, పెరుగు, చారు, నోరూరించే రుచులతో భోజనాలగది గుబాళిస్తోంది.


యశోద తళతళలాడే రెండువెండి పళ్లాలు టేబులు మీద పెట్టింది. వంట మనిషి రాములు నేముకుంటూ నేముకుంటూ స్టీల్ బేసిన్ నిండా పాత బియ్యపు అన్నం తెచ్చాడు.

రాములు ఒంటిగాడు. ఎందుచేతనో అతను పెళ్లి చేసుకోలేదు. అతని కంఠం చిత్రంగా సన్నగా వుంటుంది. రాములు జీవితమంతా వంటలు చేసి పెట్టడంతోనే గడిచిపోయింది. వరంగల్ జిల్లాలోని ఆ చుట్టుపక్కల రెండు మూడు తాలుకాల్లోని అనేకమంది భూస్వాముల ఇండ్లల్లో వంట వానిగా పని చేశాడు. పెళ్లిల్లో, శుభకార్యాలకు వంటలు చేసి దొరల, దొరసాండ్ల

## విమానాలు!

అందరూ, ప్రపంచంలోని అతిపెద్ద ఎయిర్ పోర్ట్ జాన్ ఎఫ్. కెన్నడీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ అని అనుకొంటారు. అయితే నిజానికి అత్యంత పెద్ద ఎయిర్ పోర్ట్ చికాగో ఇంటర్నేష నల్ ఎయిర్ పోర్ట్! దీనికే ', హేర్ ఫీల్డ్' అని కూడా అంటారు. అచ్చట ప్రతీ 42.5 సెకండ్లకూ విమానాలు పైకి ఎగురుతూ వుంటాయి. క్రిందికి దిగుతూ వుంటాయి! ప్రతీ గంటకు 85 విమా నాలు వెళ్ళడంగానీ, రావడంగానీ జరుగుతుంది. ప్రతీ రోజూ 2 వేల 36 విమానాలు చొప్పన వారా నికి 14 వేల 255, సం.రానికి 7 లక్షల 41 వేల 272 విమానాలు రాకపోకలు సాగిస్తాయి!

–కొడిమెల




మెప్పులు పొందాడు. మొత్తం మీద అతని జీవితవు చివరి మజిలీలో ఇక్కడ ఆగిపోయాడు. ఇక్కడ దొరికిన ఒక్కింత ఆదరణ ఇక్కడే నిలిపి వుంచింది. బతికినవ్వాళ్లు ఈ ఇంట్లో వంటలు చేసి పెట్టవచ్చువనుకున్నాడు. వొళ్లు దాచుకోకుండా పనిచేసే వానిపట్ల యశోద దయగానే వుంటుంది. యశోదలేని సమయాలల్లో ఆ ఇంటి వ్యవహారాలు రాములే నమ్మకంగా చూస్తుంటాడు.

రాములు వంటింట్లోకి వెళ్లాడు. యశోద అన్నం వడ్డించింది. తెల్లగా ముత్యాలా ఒక మెతుక్కు మరో మెతుకు అంటని సన్నని బియ్యవు అన్నమది.

అన్నం కలుపుతూ కృష్ణారెడ్డి మహేంద్రతో "రెండేండ్ల కింది పాత బియ్యమివి. మా అక్క కొత్త బియ్యం అసలే వండనియ్యదు" అన్నాడు.

మాంసం వడ్డిస్తున్న యశోద ముఖంలో రవ్వంత గర్వం. వెయ్యిపావు మహేంద్రకేసి జరిపింది.

"నువ్వుకూడా తినవే అక్కా" అన్నాడు కృష్ణారెడ్డి.

"వద్దులేరా రాములు నేను తర్వాత తింటాం" యశోద.

ఆ పక్కనే వున్న జాలి తలుపుల అలమారాలోంచి ఏదో జాడీతీసి "చేపపచ్చడి! ఎట్లుందో చూడుండ్రి" అంటూ చెరో రెండు ముక్కలు వడ్డించింది యశోద.

యశోద తల్లిగారింట్లో అనేకమంది మధ్య పుట్టి పెరిగింది. తండ్రి నైజాం కాలంలో దేశ్‌ముఖ్ కింద పట్వారి పనిచేసేవాడు. యశోదకు నలుగురు చెల్లెండ్లు. ముగ్గురు తమ్ములు. అందులో ఆఖరి వాడే కృష్ణారెడ్డి. యశోద చిన్నప్పటినుండే అనేక యుద్ధాల మధ్య పెరిగింది. ఆమె యాభై సంవత్సరాల జీవితంలో అనేక ఆటుపోట్లు చూసింది. తండ్రి గ్రామంలోని మరో భూస్వామితో చేసిన ఎడతెగని కొట్లాటలు, పంచాయితులు చూసింది. ఇంట్లోనే తన తండ్రి మొదటి భార్య కొడుకు ఆస్తిలో తన వాటా కోసం తన తండ్రితో చేసిన సుదీర్ఘ యుద్ధాన్ని చూసింది. మనుషులంతా ఎందుకోసం కొట్లాడుకుంటారో తెలిసిన మనిషి. తన జీవితకాలంలోని వ్యక్తుల జయాపజయాలను విశ్లేషించుకున్న వ్యక్తి. ఆమె చదువగలదు. రాయగలదు. వ్యవహారాలల్లో పట్టు విడుపులు చూపాలనుకునే మనిషి.

యశోదకు పిల్లలు లేరు. ఈ ఆస్తిపాస్తులు ఎవరికి దక్కుతాయోనని చెల్లెండ్లు, తమ్ములూ తమలో తాము చర్చలు చేసుకుంటూరు. యశోద మాత్రం అందరితోను మంచిగానే వుంటుంది.

సాధారణంగా అలాటి కుటుంబ స్త్రీలకు లేని లక్షణం యశోదకున్నది.

యశోద దినమంతా పనిచేస్తూనో- చేయిస్తూనో గడుపుతుంది. బహుశా ఆ కష్టమే ఆమెను సమస్త చిక్కులనుండి నిలబెట్టి వుంటుంది.

యశోద లోపలినుండి పెద్ద గిన్నెలో మీగడ పెరుగు తీసుకొచ్చి టేబుల్ మీద వుంచింది.

"నీరి భార్య ఉద్యోగం చేస్తుందన్నవ్. ఏం ఉద్యోగం"యశోద.

మహేంద్ర వారిస్తున్నాకూడా వినకుండా మరింత మాంసం వడ్డిస్తూ "రాజ్యలక్ష్మితోనే - ఇంగ్లీషు మీడియం స్కూల్లో టీచర్." కృష్ణారెడ్డి.

'ఈసారి వచ్చేటప్పుడు మరదలును పిల్లలను తీసుకరారా"యశోద మహేంద్ర కేసి చూసి "మీరుకూడానయ్యా!" అన్నది.

మహేంద్ర లోపల నవ్వుకున్నాడు. కృష్ణారెడ్డి ఓరకంట కనిపెట్టాడు.

"ఇగో ఈ పచ్చడి రుచిచూసి చెప్పండ్రి" రాములు లోపలినుండి లేత మామిడికాయ పచ్చడి తీసుకొచ్చి చెరికాస్త వడ్డించాడు.

"బ్రహ్మాండం" కృష్ణారెడ్డి - మహేంద్ర "బాగున్న"దన్నారు.

"నాయిక పోల్ల పోరి తెచ్చింది. నాలుగు పిందెలు నూరి చేసిన" రాములు.

యశోద కొసిరి కొసిరి వడ్డించింది. చివరగా మీగడ పెరుగు. మహేంద్రకు చిన్న తనంలో తల్లి జ్ఞాపకం వచ్చింది. తాను వరంగల్ నుండి సెలవులకు ఇంటికి వెళ్లితే తల్లి ఇట్లాగే వడ్డించేది. అలాంటి తల్లి పట్ల తన అసహాయత - కళ్లల్లోలోపల కన్నీటి తెర!

వంటింటి బయట పెద్ద మల్లె చెట్టు మొదట్లో చేతులు కడుక్కుంటూ "మీ బావ కన్పిం చదేమిటి?" మహేంద్ర అడిగాడు. వెనుకనే "చీకటి చీకటి వదిలం" అనుకుంటూ వచ్చిన యశోద ఈమాటవిని దీర్ఘంగా నిట్టూర్చింది.

"బావకు హన్మకొండలో పెద్దకోళ్లఫారం వున్నది. అక్కడికిక్కడికీ తిరుగుతుంటాడు-" కృష్ణారెడ్డి.

"డాబాపైకి పోదాం! నువ్వు ముందు నడువు నేవొస్తా" కృష్ణారెడ్డి ఇంటిలోపలినుండి డాబా పైకి మెట్లు చూపిస్తూ అన్నాడు.

మహేంద్ర మూతి తుడుచుకుంటూ డాబాపైకి నడిచాడు.

భోజనం చేస్తున్నప్పుడు గమనించలేదుగాని వీధిలో చాలా మంది కుప్పకూడి ఏదో మాట్లాడు కుంటున్నారు. ఇంకా వచ్చేవాళ్లు వచ్చి చేరుతున్నారు.

మహేంద్ర తనూ వెళ్లుదామా అనుకున్నాడు. తనకు సంబంధంలేని విషయాలకు పోయి చేసేదేమున్నది. డాబామీదికి అంత కనిపిస్తూనే వున్నది. అన్ని వినిపిస్తూనే వున్నాయి.

డాబాకు కింది వీధిలో కోమటి దుకాణం. అక్కడ వీధి చాలా వెడల్పుగా వున్నది. అక్కడ రైతు యువకులు మండల కేంద్రాలల్లో రేపు చేయబోయే ధర్నా గురించి అందులో పాల్గొనే రైతుల గురించీ - రైతులను చేరవేసే ట్రాక్టర్ల గురించీ మాట్లాడుకుంటున్నట్టున్నది.

పొడుగ్గా వున్న లాల్చీ ధోవతి గల ఆయన అందరిని మాట్లాడవద్దని కోరి ఉపన్యాసధోరణిలో "పార్టీలో ఏపార్టీ జెండాలుండవద్దు. దయచేసి ఈ మతలబు అర్థం చేసుకొండి."

మధ్యలో కలుగజేసుకొని ఒకాయన "వివాదాలు ఉండాల వద్దా" అన్నాడు.

ఇందాకటి లాల్చాయన ఉండొద్దన్నాడు.

ఇందాకటాయన "అదెట్ల కుదురుతది. మూగోళ్ళ తీరుగ ధర్నా చేస్తే ఎట్ల తెలుస్తది. రైతులు రైతుల బాధల గురించి ధర్నాలంటున్నారు బాగుంది. మీకు గిట్టు బాటు ధరలు గావాలె. కాదనేదిలేదు. కాని మీతోపాటు మేమువస్తున్నాం. మా గూడాలల్లో తినపోతె తిండికి లేదు."

మహేంద్ర ఆ మాట్లాడే వ్యక్తి కంఠాన్ని బట్టి - అతను గిరిజన ప్రాంతాలల్లోని సర్పంచేమో అనుకున్నాడు.

"ఈ చుట్టుపక్కల గిరిజన ప్రాంతాలల్లో కరువు తాండవమాడుతున్నది. అధికార్లువచ్చి పోయిండ్లు. రాతకోతలన్నరు.. మీదికెల్లి పోలీసోల్లు గూడేలమీదపడి తిండికి గిరిజనులు లేదుస్తుంటే పోరగండ్లను పట్టుకపోతున్నరు. మూలిగే నక్క మీద తాడిపండు పడ్డట్టున్నది. ఆరందినాల నుంచి అసెంబ్లీల కరవుగురించి ఉపన్యాసాలు దంచుతండ్లు. సహాయం ఇగో వచ్చే ఆగోవచ్చేనంటున్నరు. రైతులను అన్నకన్నా ధాన్నెంయియ్యండ్రి అంటే మొండి చెయ్యి

# 'తలాట్టు' బొమ్మ

ఎండుటాకు తెప్పమీద కూర్చుని మంచునదిలో పయనిస్తూనేవుంటానా...
హఠాత్తుగా కన్నీటి ముసురుపడుతుంది
సముద్రపు దొంగలా మీదపడ్డ
నీటిదుప్పటి కింద గిజగిజలాడుతూ
తెడ్డువేయడం మరచిపోయిన నావికుడు
గొంతు సుడిగ ండంలో వెక్కుతూ...!
గుండెల్లో డ్రిల్లింగ్ చేసినట్టు
కళ్ళలో నీటి ఊట చివ్వున ఎగసిపడుతుంది
నన్ను మాత్రమే తడిపిమోపెడు చేసే ఒకే ఒక్క పెద్ద వాన చుక్క
ఉప్పెనలా వుప్పొంగుతున్న పెదవి వింటి నుంచి బాణంలా దూసుకొచ్చి
ముకాన్ని నీలిమయం చేసి
నిలువెల్లా నీరుకారుస్తుంది
నేను తప్ప అంతా పొడిగానే వుంటుంది
కనుపాపకు చారెడు పూలజడ అల్లినట్టు చెంపల మీద వేలాడుతూ
జరీ పాయల్లా, జలపాతంలా
చెక్కిట ఎవరో చెక్కిన జలశిల్పంలా
రెప్పలపొరల కింద వూరే నీటిబుగ్గ
బుగ్గమీద జీవనది
అదేమిటోగానీ వద్దన్నా ఏడుపొస్తుంది!
"ఏడుపాపు, చంపిపారేస్తాను' అనే బెదిరింపొకటి
అలా కన్నెర్ర జేస్తే చాలు
మబ్బుల్ని మింగేసిన ఆకాశంలా
తెల్లగా పాలిపోతా



నిలువెల్లా నీటిబొట్టునై
నిలువెల్లా కన్నీటి బొమ్మనై
ఆడపిల్లనై...

అబ్బా, అదేమిటోగానీ
అమ్మల దగ్గర ఇవ్వడానికి ఇంకేం లేనట్టు
అమ్మ నుంచి అచ్చంగా,
నోట్లో గుడ్డ కుక్కుకుని
లోలోపలే గుక్కపట్టి
వెక్కివెక్కి ఏడ్చేవారసత్వం!
ఇష్టంలేదని చెప్పడం చేతగాక
కళ్ళొత్తుకోవడానికే బారెడు పైటకొంగువున్నట్టు
కొంగుకింద గుండెల్నేకాదు
గుండెల్లోపలి మనిషితనాన్నీ
ఆడతనంతో కప్పేసి అయిష్టంగానే అన్నిటికీ తలూపుతూ
'తలాట్టుబొమ్మై'-
అబ్బ ఎంతకని చెప్పను
ఏడుపుకు ఎన్నికారణాలని ఏకరువు పెట్టను?
పెళ్ళి కుదిరిందన్న నాటి నుంచి
ఎందుకోగానీ వద్దన్నా ఏడుపు ముంచుకొస్తోంది
ముడుచుకుపోయిన నన్ను చూసి
సిగ్గుపడుతున్నానంటున్నారు
అబ్బ, ఎందుకోగానీ
వద్దన్నా... ... ....!!

—పసుపులేటి గీత

మన 'కొండపల్లి బొమ్మ (నాట్యకత్తె)ను తమిళంలో 'తలాట్టు బొమ్మై' 'తలాడించే బొమ్మ' అంటారు. ఈ మధ్యనే పెళ్ళయిన స్నేహితురాలి మాటలు విన్నాక

చూవుతున్నారు."

"అరె అయ్యన్ని నిజమేనయ్య. రేపటి కొలువు సంగతి మాట్లాడుకోండ్రి" ఎవరో ముంగటి ముసలయ్య సలహాయిచ్చాడు.

రేపటి ధర్నాలరో వివాదాలు ఉండాలె - గవర్నమెంటు వెంటనే గిరిజనులకు తిండిగింజలు సప్లై చేసాయలని పోలీసు క్యాంపులు ఎత్తేయాలని - మీ డిమాండ్లతో పాటు మా నినాదాలుంటాయి." అన్నాడు ఖరాఖండిగ ఆవ్యక్తి.

తర్జన భర్జన పడ్డారు. సమధానపడ్డారు. కాసేపు ధర్నాకు సంబంధించి మాట్లాడుకున్నారు.

డాబా మీద పరుపులు పరిచి వున్నాయి. కృష్ణారెడ్డి ఇంకా పైకి రాలేదు. బహుశా యశోదతో మాట్లాడుతున్నాడేమో?

తేటగా ఆకాశం. కురుస్తున్న వెన్నెల. అడవులపై నుండి పచ్చని పొలాల మీదినుండి గాలితోలుతోంది. ఎక్కడో ఆకాశంలో ఒంటరి తీతువుపిట్ట అదే పనిగా అరుస్తోంది.

మహేంద్ర కాసేపు డాబామీద పచారు చేశాడు. డాభాగోడ పైన కూర్చున్నాడు. లోపల ముసిరే ఆలోచనలను దూరం కొట్టేందుకు దూరంగా మసకమసకగా కన్పించే ఊరును చూస్తున్నాడు. బస్సుదిగి వస్తుంటే కృష్ణారెడ్డ ఆ ఊరు గురించీ, ఊళ్లోని సంపన్న కుటుంబాల గురించి - వాళ్లకు అధికార యంత్రాంగంలో ఉన్న పలుకుబడి గురించీ చెప్పాడు.

గ్రామంలో రెండు పాతకాలపు బంగాళాలు. మరికొన్ని పెద్ద పెద్ద భవంతులు. అక్కడక్కడ కొత్తగా కట్టిన డాబాలు. వాటి మీద టివి అంటెన్నాలు. ఎక్కువ భాగం బెంగుళూరు పెంకు టెండ్లతో గ్రామం ఒకరకంగా పచ్చగా కళకళలాడుతూనే వుంది. ఆ ఊరును చూస్తుంటే మహేంద్రకు కుప్పకూలుతున్న తన ఊరు - గిరిజన దుంపగూడెం జ్ఞాపకం వచ్చాయి.

బతుకు తెరువుకోసం రైతు యువకులు గనుల ప్రాంతానికి వలసపోగా ముతకా ముసలి ఊళ్లో మిగిలిపోయారు. కూలిన గోడలు. ఒరిగిన ఇండ్లు-ఆ శిథిలాల మధ్య ఒంటరిగా తన తల్లి.

మహేంద్రకు మళ్లీ తన తల్లి జ్ఞాపకం వచ్చింది. తానెందుకు ఇక్కడికి వచ్చినట్టు? తన లోపల ఘర్షణ-నిరంతరం ఘర్షణ పడేదేమిటి? తాను దేనితో తలపడుతున్నాడు- దేన్ని వొదిలించుకోవడానికి యాతన పడుతున్నాడు. దేన్ని వెతుకుతూ దేనికోసం ఇక్కడికి వచ్చినట్టు? ఇక్కడ జరుగుతున్నదేమిటి? అసంబద్ధ ప్రయాణం. ఒక అసంబద్ధతలోనుండి మరొక అసంబద్ధతలోనికి దొర్లుకపోవడం.

పిల్లలను తీసుకొని వెళ్లిన భార్య పుట్టింటికే పోయిందా? పోనీ ఎక్కడికైనా పోనీ? కాని పిల్లలు... మహేంద్ర కెక్కడో తెగిపోతూ మళ్లీ చిక్కుపడుతూనే వున్నది.

నిజానికి తాను అనేకసార్లు సర్దుకుపోదామని ప్రయత్నించి చూశాడు. చాలా స్వల్పమైన విషయాలు పట్టించుకోకూడదనుకున్నాడు. అలాంటి సందర్భాలలో మౌనం వహించడం మంచి దనుకున్నాడు. కాని చిత్రంగా తను మౌనంగా వుండే ప్రతిసారి-తాను పోనీలే అని ఊరుకున్న

## రంగము మీదికెక్కుదము, రా...!

ఆ రోజుల్లో సాహిత్య పోరాటాలు తమాషాగా వుండేవి. తనతో సాహిత్య సమరానికి తలపడవలసిందిగా ప్రత్యర్థిని దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు ఇలా ఆహ్వానించారట.

"రంగము మీది కెక్కుదమురా! మరి
కావ్యము
సేయ నేర్తువో!
ఖంగున ఒక్క పద్యము సుఖంబుగ
పాడగనేర్తువో! రసా
భంగుర భంగి అర్థపరిపాటినచింతువో!
లోక తత్వ పా
రంగతులైన సభ్యులవురాయని మెచ్చ
నుపన్యసింతువో!
రంగము మీది కెక్కుదము, రా... ...
ఎగిరి వెక్కిరించి ఇగిలించుకొన్నట్టు
కావ్య కవులతోడి కతలు నెతలు
కవుల జెనక మారకయపోవునా? అది
కుమ్మరదునుగాదు, కమ్మరదును!

– 'మరపురాని మనీషి'

ప్రతిసారీ! ఆమె మరింత మూర్ఖంగా, మరింత పట్టుదలగా గొడవ కొనసాగించేది. తన వ్యక్తిత్వాన్ని అవహేళన చేసే స్వరంతో పరుషపదజాలం ఉపయోగించేది. తన మౌనాన్ని అపజయంగా చేతకానితనంగా అర్థం చేసుకునేది. అప్పుడు తను బద్ధలుకావాల్సి వచ్చేది.

నిజానికి గొడవలు తరుచూ ఎక్కడ ప్రారంభమౌతాయి? ఇంట్లోకి కావాల్సిన వస్తువుల కొనుగోళ్ల విషయాల్లోనేనా? అవి పైకి కన్పించే విషయాలు. అంతకంటే ఎక్కడో లోలోతుల్లో స్వభావాల్లోనే చాలా తీవ్రమైన విషయాలు ఉన్నట్టుగా తోస్తున్నది. కాని అవేమిటో తేట తెల్లంకావు. తనతోపాటే పనిచేసే ఇంజనీరు భార్య వసుమతి అంటుంది.

మహేంద్రకు వసుమతి జ్ఞాపకం వచ్చింది. వసుమతి కంపెనీ హాస్పిటల్లో డాక్టరు. ఆమె సాహిత్యం వగైరా చాలా చదువుకున్నది.

ఆమె భార్యాభర్తల గొడవల గురించి చెప్తుకొస్తుంది.

"స్త్రీలు కదా! జీవితం లేనివాళ్లు. వాళ్లు వేల సంవత్సరాలనుంచి అణచివేయబడి ఉన్నారు. కొంత సెల్ఫిష్‌నెస్ వుంటుంది. వాళ్లను ఎడ్యుకేటు చేసుకోవాలి." వసుమతి మాటలు ఒక్కొక్కటే మహేంద్రకు గుర్తొచ్చాయి.

ఎడ్యుకేషన్ ఏ సందర్భంలో ఎవరిమధ్య సాధ్యం? తనామాట అనకముందే వసుమతి గ్రహిస్తుంది.

"వందల సంవత్సరాల మానవ చరిత్రలో మగవానితో సమానస్థాయి కోసం స్త్రీలు యుద్ధాలు చేశారు. రాజుల యుద్ధాల గురించి, రాజ్య సంపకాల గురించి మాత్రమే మనకు చరిత్ర తెలుసు. అది పురుషుల వీరగాథల చరిత్ర. కాని స్త్రీలు యుద్ధాలు చేశారు. చేస్తున్నారు. అదంతా మౌఖికచరిత్ర. గ్రామదేవతలు అలాంటి పోరాటాలకు కొండగుర్తులు. ఈదమ్మ, అంకమ్మ, ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మ, ఇట్లా గుడులు, గోపురాలు లేని తనపక్కన భర్తల విగ్రహాలు లేని చేతుల్లో ఆయుధాలు ధరించిన గ్రామీణ స్త్రీ దేవతలను తరతరాలనుండి స్త్రీలు-లక్షలాది స్త్రీలు కొలుస్తూనే వున్నారు. వాళ్లు దారులప్రక్క చెట్లకింద స్త్రీలలాగే పడున్నారు. మగదేవతలు గుట్టలమీద పెద్దపెద్ద గోపురాలతో నిర్మించిన గుడుల్లో వున్నారు. మగదేవతలకు ఇరువైపులా ఇద్దరేసి భార్యలు బందీల మాదిరిగా వుంటారు. వానికి నిత్యదీపారాధనలు వుంటాయి. ఈ వివక్షత ఎప్పుడు ప్రారంభమైంది?" వసుమతి ప్రశ్నలమీద ప్రశ్నలు వేస్తుంటుంది.

వేలయేండ్లుగా స్త్రీ, పురుషులు వేరుపడిపోయారంటుంది. దాంపత్యం పేర జరిగేదంతా ఒక జబర్‌దస్తీ అంటుంది. "నిజమైన అర్థంలో మనిషికి వుండాల్సిన మానసిక, శారీరక లక్షణాలను స్త్రీ, పురుషులిద్దరూ ఎప్పుడో కోల్పోయారు. పురాతన గుహచిత్రాలు చూస్తే స్త్రీ పురుషుని మాదిరిగా ఎంత దేహదారుఢ్యంతో వుండేది. జానపద గాథల్లో స్త్రీ ఎంత ధైర్యవంతురాలు. ఎంత ఉదాత్తమైనది. కాని ఇవ్వాళ స్త్రీ ఎట్లా కన్పిస్తుంది. ఏమి మాట్లాడుతోంది. ఎట్లా చూడబడుతోంది."

నిజానికి వసుమతి మాటలతో తనకు పేచీలేదు. ఆమెకూడా లోపలెక్కడో దేంతోనో తన లాగే ఘర్షణ పడుతున్నట్లుగానే తోస్తుంది. తను చదువుకున్న చదువుకు పూర్తిగా భిన్నమైన మాటలే అవి. కాని ఆశ్చర్యకరమైన వెలుగు. తాను గడిపివచ్చిన పల్లె జీవితపు చీకటి కోణాలపైన కొత్తవెలుగు. అది కొంత నిజమే. తను చిన్నతనం నుండీ ఈ వివక్షతను చూస్తూనే వున్నాడు.

మహేంద్ర తిరిగితిరిగి తన చిన్న తనపురోజుల్లో తచ్చాడుతున్నాడు. వీధిలో జనం పలుచబడ్డారు. చిమ్మెట్లు రొద చేస్తున్నాయి. '.....పొద్దున్నే వ్యవసాయపు పనులకోసం పాలేర్లు వచ్చేవారు. తనంత చిన్న వయసు పిల్లలు. కట్టుబట్టలు సరిగా లేకుండా ఎండా, చలి, వానల్లో తనపొలాల్లో పనులు చేసేవాళ్లు. తనకు అట్లా పొలంపనులు చేయవల్సిన అవసరం పడలేదు. కాని తన చిన్నతనమంతా ఎక్కడో దూరంగా ఉన్న పొరుగూరికిపోయి చదువుకోవాల్సి వచ్చింది. ఉదయాన్నే అమ్మ తంటాలుపడ్తూ బండెడు ఇంటిచాకిరీ చేస్తూ తనకు వంట సిద్ధం చేయాల్సివచ్చేది.

తన ఈడుపిల్లలైన పాలేరు పిల్లలను చూస్తే మనసులో దోషభావం, విచారము కలిగేవి. వాళ్లు అట్లా ఎందుకు వున్నారు. తనెందుకు ఇట్లా వున్నాడనే ప్రశ్నలు ఎవరికి చెప్పకోని ప్రశ్నలు నిరంతరం వెంటాడుతుండేవి.

సమయానికి వంట అందాలనో, అమ్మ కష్టం పంచుకోవాలనో తాను ఇంటిపనుల్లో అమ్మకు సహాయపడేవాడు. పొయ్యిల్లో బూడిద ఎత్తిపోసేవాడు. ఎర్రమన్ను నేసి అలికేవాడు. అంట్లు తోమేవాడు. పొయ్యిలు అంటించేవాడు. వంటలు చేసేవాడు. బావిలోంచి నీళ్లు తోడి కలాపికోసం నీళ్లు పోసేవాడు.

ఇందుకు తన చుట్టూవున్న మనుషులు తనను ఆడంగి మనిషన్నారు. చిత్రంగా ఆడవాళ్లుకూడా.

అమ్మను తన సమస్త చర్యలతో ప్రేమించడం ఆడంగితనమా? ఈ ప్రశ్న తన చిన్న మెదట్లో సుళ్లు తిరిగేది. ఉక్రోషం ముంచుకువచ్చేది. వీళ్లందరు అమ్మలుకన్న బిడ్డలుకాదా? సరిగ్గా ఆ రోజుల్లోనే 'ఈదమ్మ కొలుపు' జరిగింది తనఇంట్లో.

రైతులు మూడేళ్ల కొకమారు లేదా అయిదేండ్ల కొకమారు అత్యంత భయభక్తులతో కొలిచే కొలుపు.

ఈదమ్మతో యుద్ధంచేసిన రాజు మాంధాత. అతను ఆడదానికి పుట్టనని మగవాని కడుపు చించుకుపుడతాడు. ఈదమ్మతో భీకరయుద్ధం చేసి ఓడిపోతాడు. ఆడదాన్ని శరణు కోరనంటాడు. అష్టకష్టాలు పడుతాడు. మహానది ప్రవాహంలాగా అందులోని అనేక దశల మాదిరిగా రాత్రంతా సాగిన 'సంబాల' వాళ్ల ఈదమ్మ కథలో చివరకు దేవతల సహకారంతో మాంధాత ఈదమ్మను తిరిగి ఓడించడము చివరకు తిరిగి రాజ్యం పొందడము.

ఆశ్చర్యంగా ఆ కథ తన మనసులో చెరుగని ముద్ర వేసింది. ఈదమ్మను ఎంత క్షుద్రదేవతగా వర్ణించి చెప్పినా కూడా ఆమెపట్ల తనకు గౌరవభావం కల్గింది.

మాంధాత తనకు మనిషిలాగా కన్పించలేదు.

అప్పటికే తన మెదట్లో తిరిగే ప్రశ్నలకు ఆ కథలో జవాబులైతే దొరకలేదుకాని తన ప్రశ్నలు నిజమైననవే నమ్మకం చిక్కింది.

కాని ఇన్నేండ్లు గడిచిన పిదప-ఇన్ని యుద్ధాలు చూసిన తర్వాత-ఎవలేని ఒంటరితనం తనను చుట్టుముట్టిన వేళ ఆ ప్రశ్నలకు జవాబులు తెలిసినట్టే తెలిసి-అంతకంతకూ లోతుకు పోతున్నాయి.

వసుమతి మాటలు పూర్తి నిజాలుగా తోచవు. మరిన్ని నిజాలేవో వసుమతి పేర్కొన్న చీకటి చరిత్రలో దాగివున్నాయి. పైకి చూడ ఇవి ఆడ మగకు జరిగే యుద్ధాలుగా కన్పిస్తున్నాయి. కాని అవి ఎందుకోసం జరిగాయి?

మహేంద్ర ఆ ప్రశ్న దగ్గరే ఆగిపోయాడు. మెదడు హఠాత్తుగా స్తంభించింది.....అదే సమయంలో ఏదో మాట్లాడుతూ కృష్ణారెడ్డి డాబాపైకి వచ్చాడు....

చుట్టూ పరికించి చూసి అర్థాంతరంగా మొదలుపెట్టి-తూర్పుకేసి చూయిస్తూ "నువ్వు ఈ ప్రాంతం గురించి వినేవుంటావుగదా! ఇట్లా సీదాకిందికి పోతే ఏటూరునాగారం. దానిపక్క గోదావరి. అది దాటుతే మధ్యప్రదేశ్. ఇటుకొంచెం పస్రా, మేడారం- మేడారం సమ్మక్క జాతర తెలుసుకదా! లక్షలాది జనం." అన్నాడు.

యశోద మేడమెట్లు ఎక్కి వచ్చింది. తన చేతిలోని మంచినీళ్లచెంబు కిందపెట్టింది. ఆయాసపడుతూ పిట్టగోడమీద కూర్చున్నది.

"మీరు పడుకున్నారనుకున్నానయ్యా" చీరకొంగుతో నుదుటి చెమట తుడుచుకుంటూ అన్నది.

"ఇంత పొద్దుగాల ఆయనెక్కడ నిదురపోతడు" కృష్ణారెడ్డి నవ్వుతూ.

డాబామీదినుండి ఓమారు చుట్టూ నిశబ్దం వహించిన ఊరును చూస్తూ "రోజులు బాగాలేవు లోపల పడుకోండ్రంటే వినకపోతిరి. ఇక్కడ పగలో తీరు-రాత్రి ఒకతీరు." యశోద.

కాసేపు ఎవరూ మాట్లాడలేదు.

"ఈమె చాలా ఆసక్తికరమైన మనిషే" మహేంద్ర మనసులో అనుకున్నాడు.

"వారిగాని పంబెదు ఏమైందక్కా" కృష్ణారెడ్డి లోపల ఇందాకా అక్కాతమ్ముళ్ళు మాట్లాడిన విషయాల కొనసాగింపుగా.

"వానింట్ల పీనిగెల్ల" యశోద.

"మా అక్కింట్ల పనిచేసిన దాసి కొడుకు వారిగాడు" కృష్ణారెడ్డి మహేంద్రకు చెప్పి.

"అంటే పంచాయతి తెగిందా లేదా?" అక్కతో.

"ఏమాట కామాటే చెప్పుకోవాలె. అన్నలు కొన్ని పనులు మంచిగనే చేస్తరు...." యశోద పిట్టగోడ మీదినుండి లేచివచ్చి పరుపులో కూర్చున్నది. కృష్ణారెడ్డి పరుపులో సగం పడుకున్నాడు: మహేంద్ర తనకోసం వేసిన పరుపులో కూర్చున్నాడు.

"మామగారు చనిపోకముందు కుంటెనుక వానికి మూడెకరాల పొలం యిచ్చిండ్రు- ఊర నతలి వాయికపొల్లవాడల ఇంటికోసం భూమి ఇచ్చిండ్రు....లంగ గాడిది పనిపాటలేక- దున్నక దొకక తిరిగి తిని, తాగి ఆ మూడెకరాలు ఎవనికో కుదువబెట్టుకున్నడు. మల్ల తిండికి లేకుంటయ్యింది.

మల్లీ ఇంటిమీదికొచ్చి నాకు ఆస్తిలో సగంవాటా కావాలని కూర్చున్నడు. చంపుతనని, ఇల్లు కాలబెడుతనని రోజు ఇంటిమీదికి తాగి దండయాత్రలు....మునుపటి రోజులు గాదు. తెగిడిసిన గాడ్డి. ఎందుకైన మంచిదని మీ బావను హనుమకొండలనే ఉండమన్న. నేను ఎట్లనన్న కానియ్యిమని ఉదున్న. ఇకవాడు పోయి అన్నలకు ఫిర్యాదు చేసుకున్నడు.

ఓవాడు ఇగో ఇంతరాత్రి పంచాయితని నన్ను పిలిపిచ్చిండ్రు. తమ్మీ నాకు కాళ్లు చేతులు గబ గబ వనికినయ్. అన్నలు-తుపాకులు. ఎట్లయితే గట్లయితదని నాట్ల రాజమ్మను వెంటదీసుకొని పోయిన. వాళ్లు అక్కా అక్కా అని రీతిరివాజంతోనే మాట్లాడిండ్రు."

"అసలు ఏమన్నరువాళ్లు?" కృష్ణారెడ్డి.

"పుట్టు పూర్వోత్తరాలు అడిగిండ్రు. నన్ను, వాన్ని, ఊళ్లోవాళ్లను. అన్ని విన్నంక వాని ముడ్డి మీదనే తన్నినట్టు చెప్పిండ్రు...

"బిడ్డా! నువ్వు ఆస్తిలో వాటా సగం కావాలని కొట్లాడుతున్నావు బాగనే ఉన్నది. నీకు మునుపు మూడెకరాలిస్తే కాపాడుకోలేదు. సరే పోయిందేదో పోయింది. మేం యశోదక్కను ఒప్పించి చెరువుకింద ఎకరం పొలం యిప్పిస్తం. మునుపటి తీరుగా ఆగం తిరుగకు. రెండు దున్నపోతులను కూడా యిప్పిస్తం. నువ్వు నాగలికట్టి ఆ పొలం దున్నుకుంటనే నీకుంటది. తాగడం మంచిదిగాదు. లేకుంటే ఆ ఎకరం దున్నుక బతికెటోనికిచ్చి పోతం.

పైగా ఈ ఊళ్లే ఉన్న భూమి నీఒక్కనిది కాదు. ఇంకా చాలా మందిది." దళం నారాయణతో చెప్పిన ఆఖరుమాటలు యశోద కావాలనే చెప్పలేదు. ఆ మాటలు చెప్పడానికి ఆమెకు ధైర్యం చాలలేదు.

యశోద కూర్చున్నదల్లా లేచి నిలబడి ఆవులించింది.

"ఇప్పటికైతే పంచాదు పీడ పోయినట్టే కుక్కల కొడుకు ఇప్పుడు దున్నపోతుల కట్టుకొని నానా తిప్పలు పడుతున్నడు. మునుపు మనింట్లున్నప్పుడు గద్దాము మీద బర్రె తిన్నట్టు తినే...." అనుకుంటనే మేడమెట్లు దిగిపోతూ.

"పొద్దుపోయింది. పడుకోండి. రేప్పొద్దున రామప్పగుడి-చెరువూ శివయ్యతో కలిసి చూడ పోదురు. " అన్నది యశోద.

"నందేండ్లకింద కాబోలు! మా బావ నాయినమ్మ-ఆమె భర్త పేరేమిటో నాకు తెలియదు. భర్తతో కలిసి హంబిరాబాదు తాలూకా నుండి బతుకుతెరువుకోసం ఈ ప్రాంతం వచ్చారట. మొదట్లో ఈ ఊళ్లో చిన్న కిరాణా దుకానాలు పెట్టుకున్నరట. అట్ల ప్రారంభమై ఇప్పుడు చెరువుకింద రెండు పంటలు పండే నందెకరాల పొలంకు ఆసాములు. ఒకప్పుడు ఇక్కడి భూములన్ని వాయికపొల్లనేనట.

ముసల్ది నా ఎరుకదాకా బతికింది. చాలా సంవత్సరాలు మంచంలోనే గడిపింది. అయినా సచ్చేదాకా రికాముండేది కాదు. నిన్తళ్ళు కుట్టేది. అట్లా ముసలిదాని సంపాదనే-లచ్చి అని ఒక దాసిది ఇంట్లో ఉంది. ఎప్పుడో చిన్న పోరిని ఇంట్లకు పనిమనిషిగ తెచ్చుకున్నరట. అది అట్లనే ఆడపాప ల(దాసి)గా ఉండిపోయింది. మా బావతండ్రే వుంచుకున్నడు. ఆమధ్య గవర్నమెంటు చట్టం చేసింది కదా! అందుకని ఆ దాసి కుటుంబాన్ని ఇంట్లోనుండి బయటకు పంపేటప్పుడు దాని కొడుకు నారాయణకు మూడెకరాలు యిచ్చారు. అది మా అక్క చెప్పిన 'కథ." కృష్ణారెడ్డి.

కృష్ణారెడ్డి కాసేపాగి "అసలు ఈ చుట్టుముట్టు పెద్దపెద్ద గ్రామాల్లోని వారెవరూ ఈ ప్రాంతం వారు కానేకాదు. వాళ్లంతా పెద్దపల్లి, పర్కాల, హంబిరాబాదు, వరంగల్ చుట్టుపక్కల నుండి పరిపాలన నిమిత్తం-బతుకుతెరువుకోసం వచ్చినవాళ్లే. పేరుపడ్డ వంశాలవాళ్లంతా అట్లా వచ్చి నవాళ్లే ఇప్పుడిప్పుడు కృష్ణా, గుంటూరు జిల్లాలవాళ్లు వచ్చి చేరుతున్నారు....

ఇదంతా నోదిక్కు, జరుగుతే మరోదిక్కు అన్నలు. అన్నలు ఈ ప్రాంతంలో నా చిన్నతనం నుండే వున్నరనుకో. వాళ్లువీళ్లు కొట్లాడిండ్లు. కలిసేఉన్నరు. కాని ఈ మధ్యలోనే చెన్నారెడ్డి టైంల అన్నలు బాగా వ్యాపించారు. మీదిమీది కొట్లాటలన్నీ సీరియస్పై భూముల పంపకాలు వగైరా అంతకంతకూ ముదిరిపోతున్నది. చూడబోతే సీరియస్సే అయేట్టున్నది....పోలీసులు. వాళ్లవీళ్ల ఎత్తులు పై ఎత్తులు." కృష్ణారెడ్డి చెప్పతూనే నిద్రలోకి జారుకున్నాడు.

మహేంద్ర కళ్లు నిలబడే ఉన్నాయి. మెత్తటి దూదిపరుపు మీద వెల్లకిలా పడుతున్నాడు.

ఆకాశంలో ఒకటి అరా దూదిపింజలాంటి మేఘాలు. రాత్రి ప్రశాంతంగా, నిర్మలంగా వుంది. పొలాలమీంచి గాలి మరింత చల్లగా వీస్తోంది.

మహేంద్రకు పడుకోబుద్ధికాలేదు. తను ఆలోచించుకోవడానికి దొరికిన సమయం, లేచి పిట్టగోడపైన చేతులానించి కిందికి చూశాడు.

కింద ఎవ్వరో లైట్లు ఆర్పివేశారు. ఊరుఉలుకుమగ్గింది.

విశాలమైన వేసంగి వరిపొలాల మీదుగా దక్షిణం వేపు నిశ్చలంగా కూర్చున్న రెండు గుట్ట బోర్లు - వాటిమధ్యన చెరువుకట్ట - చెరుకుకట్ట మీద గెస్ట్‌హౌస్‌లో వెలుతురు.

'ఈ పచ్చని పొలాలమీదుగా ఎంతరక్తం ప్రవహించిందో ఈ భూముల కోసం - వీటిమీది పంటకోసం ఎన్నివందల సంవత్సరాలుగా ఎన్ని యుద్ధాలు జరిగాయో ఈ పచ్చదనం ఇట్లాకలకల లాడటానికి ఎన్ని వందల వేలమంది నిహతులయ్యారో?

ఎన్నీటి 'వైభవోజ్వల' కాకతీయ సామ్రాజ్యం! శిస్తువసూలు కోసం మేడారం అటవీ ప్రాంతంపై కాకతీయుల దండయాత్ర - కరువువల్ల పన్నులు కట్టలేక పైవ్యాన్ని ప్రతిఘటించి నేలకొరిగిన గిరిజనులు - వారి ప్రతినిధుల గురించి గిరిజనుల గుండెల్లో హత్తుకపోయిన జ్ఞాపకం - ఇప్పటికీ శివం తూలేటప్పుడు గతం వర్తమానం కలిసిపోయిన వొత్తిళ్ళ కథావర్ణన.

అదంతా రూపుకట్టి మహేంద్ర హృదయం మరింత బరువెక్కింది.

ఆ పోరాటాల అణచివేసి - గిరిజనుల వ్యవసాయ పద్ధతులను వాళ్ళ అనుభవాలను అవచివేసి అక్కడ చెరువుల తవ్వకం జరిపించి - తన భావ సంబంధీకులను సరఫరా చేసింది కాకతీయ సామ్రాజ్యం. అయినా గిరిజనులు అక్కడే ఉన్నారు. నిరంతరం పోరాడుతూనే వున్నారు.

చరిత్రపుటల్లో రుద్రమదేవి తదితరులు గొప్పపరిపాలకులుగా కీర్తించబడినారు. లక్షలాదిమంది హృదయాలల్లో మేడారం - సమ్మక్క తదితరులు నిలిచిపోయారు. రెండుదారులుగా చీలి ఏదారికాదారే అట్లాగే వుంటూవచ్చింది.

యుద్ధంలో ఇరువైపులా నిలిచిపోరాడింది స్త్రీలే - ఎట్లా జరిగిందిదీ - మహేంద్ర ఈ కొత్త నిర్ధారణకు ఆశ్చర్యపోయాడు. తనలోపల చిక్కుముడి ఏదో విడిపోతున్నట్టు తోచింది. తిమిరంలో జరిగే సంకులసమరం పైన మెల్లమెల్లగా వెలుతురు ప్రసరిస్తున్నట్టుగా తోచింది. తన అంతరంగ సంఘర్షణకు మూలమెక్కడో బోధపడుతున్నట్టుగా తోచింది.

ఔను వాళ్లిద్దరు ఆడవాళ్లే కదా!

## బుజువు



సుప్రసిద్ధ సంగీతకారుడు ఎహుదీ మెనూహీన్, తన పదకొండవ ఏట బెర్లిన్‌లో, సంగీతంలో తనకుగల ప్రజ్ఞను ప్రదర్శించాడు. ఆ సంగీత సభలో విఖ్యాత శాస్త్రజ్ఞుడు ఐన్‌స్టీన్‌కూడా వున్నారు. ఆయన మెనూహీన్ వినిపించిన సంగీతానికి తన్మయత్వం చెందాడు. వేదిక మీదకు వెళ్లి ఆ పసివాణ్ణి సంతోషంతో ఓసారి గాలిలోకి ఎత్తి

"ఎహూదీ ఈ రోజున నువ్వు మరొకసారి బుజువు చేశావు- స్వర్గంలో దేవుడనేవాడు ఉన్నాడని" అన్నాడు. — శ్రీరామమూర్తి

# బొత్తంపట్టని కాజా

చదువుకుంటానంటే చంపుతానని నాన్నా
సినిమా కెళ్తానంటే తంతానని యజమానీ.
వాడి బాల్యానుభూతుల మామిడిపూతల మీద మంచులా కురుస్తారు
ఇంకా పిడికెడు అనుభవాలైనా ఏరని వాడి పసిచేతుల్లోకి
కుటుంబ స్థితిగతులు సూదిమొనలా దిగుతాయి
ఇష్టంలేకపోయినా అదే జీవనాధారమని అర్థమైపోయాకా
సూదీదారమే వాడికి బంధువులూ స్నేహితులూ...
పొద్దున్నెప్పుడో తిన్న గుప్పెడు చద్దిమెతుకులూ
మధ్యాహ్నం యజమాని పోయించిన గుక్కెడు టీనీళ్ళూ
ఇవే వాడికి పంచభక్ష్యపరమాన్నాలూ...
వాడు అందంగా అతిచాకచక్యంగా
దుస్తులకు కాజాలు కుడతాడు, బొత్తాలు కుడతాడు
తన బతుకు వస్త్రం చిరురంగులనేమాత్రం కుట్టుకోలేదు
రీలు నుంచి దారాన్ని తెంపుతున్నంత సులువుగా
తన గుండె కండె నుండి కష్టాల్ని తెంపుకోలేదు
వాడి చుట్టూ దండాల మీంచి
సీతాకోకచిలుకల రెక్కల్లాంటి బట్టలు వ్రేలాడుతుంటాయి
వాడి కళ్ళల్లోంచి మాత్రం
నాన్న నోట్లోంచి కురిసే బూతులూ, రంగువెలసిన అమ్మనవ్వులూ వ్రేలాడుతాయి
కుట్టుసరిగాలేదనో 'టీ' తేవడం ఆలస్యమైందనో
యజమాని కొట్టినప్పుడు
వాడి కంట్లోంచి రాలే ఒక్కొక్క బొట్టూ ఒక్కొక్క సముద్రమై
ఈ ప్రపంచాన్నెందుకు ముంచెయ్యదో వాడి ఊహకు అందదు
సూదిలో దారం ఎక్కించేటప్పుడు వాడిలో
పసిమెదళ్ళలోకి విజ్ఞానం నెక్కించే గురువు ఓర్పు కనిపిస్తుంది.
వాడు కాజాలు కుదుతున్నప్పుడు
రాట్నం తిప్పుతున్న గాంధీ జ్ఞాపకమొస్తాడు
వాడు బొత్తాలు కుదుతున్నప్పుడు
శస్త్రచికిత్స చేస్తున్న కోట్నీస్ గోచరిస్తాడు
వాడు చేతి కుట్టుకుదుతున్నప్పుడు
చిక్కుతీసి తలదువ్వుతున్న అమ్మ ప్రత్యక్షమవుతుంది
నెలాఖరున వాడు జీతం తీసుకున్న క్షణంలోనే
బూతుల గుర్రాలెక్కి వచ్చిన తండ్రి, జేబును గుంజుకుపోయినప్పుడు
చొక్కా నుంచి తెగిపడిన బొత్తంలా వాడు-
చిత్తుగా తాగి వచ్చిన తండ్రిని నిలదీయనూ లేక
నెత్తీనోరూ బాదుకుని విలపించే తల్లిని సముదాయించనూ లేక
ఏళ్ళ అంచులతో తెంపి ఉమ్మే దారపుకొసల సాక్షిగా ఎప్పటిలాగే
తన కళ్ళ గ్రహాల్ని ఢీకొనే అవసరాల తోకచుక్కల్ని మోసుకుంటూ వాడు-
వాడిస్మర్శలో నలిగి పునీతమైన బట్టల్ని తొడుక్కుని
శరీరంనిండా గర్వాన్ని పూసుకుంటూ నేను-

— భగ్వాన్

తనకూ తన భార్యకు జరిగిన వాదులాటలో భార్య అంది.

తనకు ఆడదంటే అర్థంకాదని - కనుక ఆడదాని గురించి మాట్లాడే అర్హత నీకు లేనేలేదని - అప్పుడు తన నాలుక చివరిదాకా ఒకమాట వచ్చింది. మరి తన తల్లి, అక్కా ఆడవాళ్ళు కాదా? వాళ్లనెందుకు ఆడదానివైన నువ్వు సహించవని - కాని తనకు అడుగాలన్పించలేదు అడగడమే వృథా!

చరిత్రలో మగవారికీ మగవారికీ మధ్య యుద్ధాలు జరిగాయి. ఆడదానికీ మగవారికీ మధ్య యుద్ధాలు జరిగాయి. ఆ యుద్ధాలన్నిటినీ ఏదో పేర్లు పెట్టారు. మరి స్త్రీల మధ్య జరిగిన యుద్ధాలను ఎట్లా అర్థం చేసుకోవాలి.

ఈ యుద్ధాలన్నీ స్త్రీలైనంత మాత్రానా. పురుషులైనంతమాత్రానా జరిగాయా? పైకి చూడ అట్లా కన్పిస్తాయిగాని అన్ని యుద్ధాల అసలు కారణాలు వేరే ఉన్నాయి. తనని పీడించి, హింసించి తనరెక్కల కష్టాన్ని దోచుకునే వారిమీద కష్టజీవులు సాగించిన యుద్ధాలు కాదా? అందులోనే - అటుఇటు స్త్రీ, పురుషులు లేరా?

ఈదమ్మ మాంధాతతో కొట్లాడినా, సమ్మక్క రుద్రమదేవితో తలపడినా? ఇవి కష్టజీవులు పరాన్న భుక్కులతో చేసిన యుద్ధాలు కావా? ఈదమ్మలాంటి గ్రామ దేవతలకు సమ్మక్క సారక్కకు తేడా ఏమైన ఉందా? పురుషుడైన మాంధాతకు స్త్రీ అయిన రుద్రమదేవికి రూపంలో తప్ప స్వభావంలో తేడా ఏమైనా వుందా?

తాను తన భార్య నిరంతరం చేసేయుద్ధం - పరస్పర విరుద్ధ జీవన విధానాల సారాంశల స్వభావాల మధ్య జరిగే సంఘర్షణలు ఎవరి రెక్కల కష్టం వారికే చెందాలనేది ఒక జీవన విధానానికి సంబంధించిన స్వభావం - ఒకరి రెక్కల కష్టాన్ని పీడించి దోచుకుతినాలనేది రెండోది - ఈ రెంటి మధ్య రాజీలేని యుద్ధాలే ఇవి.

వీటికి స్త్రీ పురుష విచక్షణ లేదు. వీటికి కులం, మతం, జాతి ప్రసక్తి లేదు. ఒకడి రెక్కల కష్టాన్ని దోచుకోవాలి, ఆ దోపిడిని ప్రతిఘటించాలి. ఇది అంతులేని అనంతకాలాల యుద్ధం.

మహేంద్రకు తనెటు నిలిచాడో? తన భార్య ఎటునిలిచిందో స్పష్టంగా బోధపడ్డది.

ఈ నిర్ధారణకు మహేంద్ర ఒళ్లు గగుర్పొడిచింది. ఒకే దేశం ప్రాంతం, గ్రామం, తెగకాదు - ఒకే ఇంట్లో ఒకే పడకపై శత్రువుతో చేసే సంసారం.

కొండచిలువ స్పర్శలూ - 'గదదుగదదు' మృగవాసన లేవో మొత్తం వ్యాపిస్తున్నట్టు - క్షణకాలం శరీరం చల్లబడిపోయింది. చిలికిచిలికి గాలి వానలయ్యే గొడవల అసలు కారణం బోధపడింది.

అయితే - ఇది ఇంతేనా? ఇందులో రాజీ పడదగినదేమైనా ఉందా? తామిద్దరి మధ్య రాజీ సాధ్యమేనా? రక్తసిక్త చరిత్రలో - వేలయేండ్లుగా సాగే యుద్ధంలో ఇంకా రాజీపడటం సాధ్య మేనా? పడకపోతే ఏమౌతుంది? కృష్ణారెడ్డి రాజీ సాధ్యమేనంటాడు. పనిమనిషిని పెట్టుకుంటే గొడవలు కొన్ని సర్దుబాటయిపోతాయంటాడు. కాని తనకు తెలుస్తూనే ఉంటుంది.

మహేంద్రకు కనుకొలుకుల్లో నీళ్లూరాయి. పిల్లలు జ్ఞాపకానికి వచ్చారు.

పోనీ పిల్లలు తల్లి స్వభావమే పునికిపుచ్చుకుంటే పోనీ అనుకునేవాడు. వాళ్లు తన ముఖం చూస్తారు.

తామిద్దరి మధ్య యుద్ధాల్లో పిల్లల పెంపకం సజావుగా సాగడంలేదు... తానెందుకోసమైతే విభాయించుకుంటాడో అది కుదరదని తేలిపోతోంది.

ఎందుకో హఠాత్తుగా ఒంటరితనం చుట్టుముట్టింది. తనకు తన రక్తం పంచి ఇచ్చిన కన్నతల్లిదండ్రులు తన బాగోగులు చూసి తనను జీవితంలో నిలిపి తానొరిగిపోయిన తన అక్క, తనతన జీవితాలను ధారపోస్తూ తనకూ - లోకులకూ జ్ఞానాన్ని, వెలుగునూ పంచుతూ ఆరిపోయిన మిత్రులు - అంతమైన మనుషులు - ఎందరెందరో స్మృతిపథంలో మెదలసాగారు.

మహేంద్రకు కడుపులో నుంచి ఘనీభవించిన దుఃఖం ఎగదన్నుకొచ్చింది. నిలువెల్లా ఊగి పోతూ డాబా పిట్టగోడను పట్టుకొని - సమస్త ఘర్షణలను దుఃఖాలను కడుపులో దాచుకొని నిశ్శబ్దంగా నిద్రిస్తున్న ఆ ఊరులో - మహేంద్ర వెక్కివెక్కి ఏడ్చాడు.

వందలవేల సంవత్సరాలుగా ఆ భూములపైన మానవుల దుఃఖావేశాలను తనలో ఇముడ్చు కుంటూ వస్తున్న ఆ నేల, ఆ గాలి, మహేంద్ర కన్నీటినీ, కంఠధ్వనినీ తమలో కలుపుకున్నాయి..

ఓదార్చాయి.

ఎందుకో మహేంద్రకు తన శరీరంమీద, తనమీద అసహ్యం వేసింది. అంతులేని నిరాశ ఆవరించింది.

లుంగీతో కళ్లు తుడుచుకొని పక్కపై వాలాడు. తలపగిలిపోగలదేమోనన్నంత తలనొప్పి - కళ్లు మండుతున్నాయి. మెదట్లో భాస్వరపు మంటలు. లోలోపల అంతులేని నిరంతర విస్ఫోటనాలతో శరీరం దణదణలాడుతూ కంపిస్తోంది. దేహం వేయివ్వొక్క ముక్కలుగా వెదజల్లబడుతున్నట్లుగా అన్పిస్తోంది.

'అయితే ఎట్లామరి?' అన్నీ కలగల్సిపోయి ఒకే ఒక ప్రశ్నయై ప్రతిధ్వనిస్తోంది.

మహేంద్ర నిప్పులమీద మొక్కజొన్న కంకిలాగా పక్కమీద బొర్లుతున్నాడు. ఆవిర్లు కమ్ముతున్న అతని చెవుల్లోకి ఎక్కడినుండో సన్నని కలకలం విన్పించింది. మహేంద్ర మొదట పట్టించుకోలేదు.

కాని ఆ కలకలం అంతకంతకు ఎక్కువైంది. అది ఊరంతా సుళ్లు తిరిగి తాము పడుకున్న డాబాకింది దాకా వచ్చినట్టు అన్పించింది. క్రిందినుండి ఏవో సూచనలు - మాటలు - హెచ్చరికలు, మందలించడాలు వందలాది మనుషుల కంఠధ్వనులు...

మహేంద్ర లేచి కూర్చున్నాడు. కలకంటున్నాడా? లేదా ఆ కలకలం తన లోపలిదా? భ్రమనుండి వచ్చిందా?

ధనధన మంటుండగా కింద తలుపులు తడుతున్నారు. గట్టిగా తలుపులను బాదుతున్నారు. తలుపులు తెరవమని హెచ్చరికలు ఒక పక్క విన్పిస్తుండగానే గోడల మీద మనుషులు. ప్రహరీగోడల మధ్య కుక్కలు పెద్దగా మొరుగుతున్నాయి. ఊళ్లో అక్కడక్కడ బయ్యిబయ్యిన కుక్కలు మొరుగుతూనే ఉన్నాయి.

వీధిలో వందలాది మంది మట్టి మనుషుల్లాగా గిరిజనులు నిలబడి వున్నారు. ఎడ్లబండ్లు. చాలామంది సంపన్న రైతుల ఇండ్లు చుట్టుముట్టినట్టుగా ఊరంతా కలకలం విన్పిస్తోంది.

తలుపులు భళ్లున తెరుచుకున్నాయి. కట్టతెగినట్టు బిలబిలలాడుతూ మందిలోపలికి పరుగులు పెట్టారు. కుక్కను ఎవరో గొలుసుకు బంధించారు. దాని మొరుగుడు విన్పడనంత గందరగోళం -

లోపలి నుంచి ధాన్యం, బట్టలు - గునగున నడిచి వీధిలోకి పడుతున్నాయి. బండ్లకెత్తుతున్నారు. మూటలు కడుతున్నారు. తరతరాల ఆకలికి, అవసరానికి, అన్యాయంగా కన్పించే న్యాయానికి కాళ్లు, నోరు వచ్చినట్టుగా - అంతా ఎప్పుడో నిర్ణయమైపోయినట్టుగానే జరిగిపోయింది.

లోపలి నుంచి యశోధ వేడికోళ్లు - బతిమిలాడటం - చివరకు ఏడ్వడం విన్పిస్తోంది.

"కిందికిపోదాంపద" కృష్ణారెడ్డి గబగబ మెట్లు దిగసాగిండు.

తన శరీరంలో నుంచి ఏదో పొగలు కక్కుతూ బయట పడుతున్నట్టుగా మహేంద్ర అతన్ని అనుసరించాడు.

కింద అన్ని లైట్లు వెలుగుతున్నాయి. పెయిమీద అంగీలు లేని గిరిజనులు - ఎండలకూ, వానలకూ మట్టికుండల్లాంటి శరీరాలు కల గిరిజనులు - ఎండకపోయిన శరీరాలు - మొఖాలు గల స్త్రీలు, పిల్లలు, పురుషులు అంతా ఒకే గూటి మనుషుల్లాగా - ద్వేషమో - మరేదో తెలియని చూపులతో - దేన్ని ఖాతరుచేయని బలవంతుల్లాగా అంతా క్రమశిక్షణ కలిగిన సైనికుల్లాగా - తమ తరతరాల సంపద అక్కడే పోగుపడ్డట్టు తీసుకపోతున్నారు.

ఆ మందలో అక్కడక్కడ సాంప్రదాయిక ఆయుధాలు ధరించిన గిరిజనులకు తోడు యూనిఫాం, తుపాకులు ధరించిన దళం కూడా తిరుగుతోంది. ఆ డాబాకు దక్షిణం వేపున ఉన్న మూడిండ్ల పెంకుటిల్లు ధాన్యపుయిల్లు తలుపులు తెరచారు. ధాన్యాన్ని బండ్లకెత్తారు.

సామాన్లు మోసేవాళ్లు మోస్తుండగా - ఆజ్ఞలు సూచనలు ఇచ్చేవారు యిస్తున్నారు. నలుగురు గిరిజనులు మహేంద్రను, కృష్ణారెడ్డిని పట్టుకున్నారు. వాళ్లు పెనుగులాడకపోయ్యేసరికి వాళ్లను ఒదిలిపెట్టమన్నారు మరెవరో -

కలో- నిజమో - కలనిజం కలగల్సిపోయినస్థితో - మాటలేవో చేతలేవో? ఎటుండాలో? ఎటు మాట్లాడాలో తెలియని విచిత్ర స్థితిలో మహేంద్ర ఉండగా - కృష్ణారెడ్డి అసంబద్ధంగా, ఆదరబాదరగా తడారిన గొంతుతో ఏదో అంటున్నాడు.

వంటమనిషి రాములు యశోదను ఓదార్చడానికి తంటాలు పడుతున్నాడు... తనేమన్న ఆపగలనేమోనని వృధా ప్రయాసతో కాసేపు గిరిజనుల చుట్టూ తిరుగుతున్నాడు.

సమయం ఎంత పట్టిందోగాని తాము తీసుకపోవాలనుకున్న ప్రతి సామాను తీసుకపోయారు. ఇల్లు బోసిబోయింది. ఇల్లులాగే యశోదగోడకు చతికిల పడి ఏడుస్తోంది.

ఇంట్లో గిరిజనులు పలుచగా ఇంకా తిరుగుతున్నారు. ఒక గిరిజన స్త్రీ చీరల్ని అబగా మడిచి గుండెలకు హత్తుకొని గడపదాటుతోంది. ఆమె చేతిలో ఎనిమిది తొమ్మిదేండ్ల గిరిజన పిల్ల - పైన జాకెట్టులేదు. చిరిగిపోయిన మొలగుడ్డ - పరికికంపలాంటి రేగిన జుట్టు.

గడుపదాటుతూ ఆ పిల్ల ఒకమారు వెనుతిరిగి చూసింది. చిత్రంగా ఆ పిల్ల ఏమి తీసుకోలేదు... ఆ సమస్తవస్తువులకన్నా - అవి దొరికిన సంతోషంకన్నా - మించినదేదో ఆ చూపుల్లో ఉందా? ఆ చూపులను నిర్వచించలేరెవ్వరూ!

మహేంద్ర విప్పారిన ముఖంతో పనిపిల్లను చూశాడు. ఆ పిల్ల కూడా తనను గుర్తించిందని మహేంద్రకు అన్పించింది.

కృష్ణారెడ్డి మాత్రం ఆ పిల్లను చూసి షాక్ తిన్నట్టు అయ్యాడు. సాయంత్రం గూడెంలో తాము చూసివచ్చిన పనిపిల్లే ఈ పిల్ల. యశోద ఏడుస్తూనే ఉంది. కృష్ణారెడ్డి ఆ షాక్‌నుంచి తేరుకోనే లేదు.

మహేంద్ర తనకు తెలియకుండానే, సాగుతున్న గిరిజన గుంపును చూస్తూ బయటదాకా వచ్చాడు.

ఊళ్లో అక్కడక్కడ శోకాలు ఓదార్పులు ఉండీఉండీ విన్పిస్తున్నాయి.

బండిగీరెల చప్పుల్లు, ఎడ్ల అదలింపులు, గిరిజనుల సంతోషాతిశయపు కంఠధ్వనులు - ఊళ్లో పోగుపడిన సంపద తరలింపుతో గిరిజన మందసవ్వడి అంతకంతకు దూరం కాసాగింది.

అప్పుడు ఊళ్లోని వాళ్లంతా వీధుల్లోకి వచ్చారు. ఎవరో పెద్దగా చెప్తున్నారు. 'మొత్తం ఆరిండ్లు దోసింద్రు' ఆ ఆసాముల పేర్లు చెప్తకొచ్చాడు.

'కదును ఇండ్లను ముట్టుకోలేదు' అన్నారెవరో -

మహేంద్ర లోపలికి వచ్చి విచారంతో ఉన్న కృష్ణారెడ్డిని సమీపించాడు. కృష్ణారెడ్డి తనెన్నడూ చూడని పరమ ప్రశాంతతను మహేంద్ర ముఖంలో చూశాడు. ◆

## సర్వేపల్లి

బి.ఎన్.రెడ్డిగారి కళాత్మక సృష్టి 'మల్లీశ్వరి' చిత్రం ఆనాడు కలిగించిన సంచలనం అంతా ఇంతా కాదు. ఈ చిత్రానికి అనేక అవార్డులతోపాటు ప్రేక్షకుల రివార్డులు కూడా ఘనంగానే అందాయి.

అప్పటి ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారు ఆ చిత్రాన్ని చూడాలన్న అభిలాషను వ్యక్తం చేశారు. మద్రాస్‌లో ఆయన కొరకు ప్రత్యేక ప్రదర్శనను బి.ఎన్.రెడ్డిగారు ఏర్పాటు చేయడం జరిగింది.

చిత్రం ఆరంభానికి ముందు పద్మశ్రీ చిత్తూరు నాగయ్యగారు రాధాకృష్ణన్‌గారితో "మా బి.ఎన్.గారి దర్శకత్వంలో ఏ చిన్న తప్పూ పట్టడం అసాధ్యం కాదు..." అంటూ చెప్పారు.

రాధాకృష్ణన్‌గారు నవ్వి "చూద్దాం ప్రదర్శించండి..." అన్నారు. చిత్రం పూర్తి అయింది.

ఆ తర్వాత తేనీరు సేవిస్తున్న సమయంలో "ఎలా వుంది సార్ పిక్చర్?" అని అడిగారు నాగయ్యగారు. అప్పుడు బి.ఎన్.గారు, మరికొందరు సినీ ప్రముఖులు కూడా అక్కడే వున్నారు.

"సినిమా ఆరంభం నుంచీ చాలా కళాత్మకంగా తీర్చిదిద్దారు. కాకుంటే నా పరిశీలనకో చిన్న విషయం వచ్చింది. చెప్పమంటారా?" అన్నారు.

"చెప్పండి సార్..." అందరూ ఆసక్తిగా అడిగారు.

"తిరుణాల నుండి తిరిగి వస్తుంటే వర్షం కారణంగా మల్లీశ్వరి, నాగరాజులిద్దరూ ఒక గృహంలో తలదాచుకుంటారు. ఆ తరువాత రాజుగారు ఆమె నృత్యం చూడడం, రాజప్రసాదానికి రమ్మని కోరడం... అంత వరకూ బాగానే వుంది. కానీ తిరిగి రాజుగారూ, మంత్రిగారూ వెళ్లేటప్పుడు గుర్రాలు దుమ్ము లేపుకుంటూ వెళ్ళాయి. అంతకు ముందే గంటల తరబడి వర్షం కురిస్తే గుర్రాల పదఘట్టనలకు దుమ్ము, ధూళీ లేపడం సాధ్యమా?"

అంటూ సూక్ష్మమైన పరిశీలనను బైట పెట్టేసరికి, బి.ఎన్.గారితోసహా అందరూ సర్వేపల్లిగారి పరిశీలనా దృష్టికి ఆశ్చర్యపోయారు.

- పి.వి.రమణకుమార్